

కొండపి వేలం కేంద్రంలో కొనుగోళ్లలో పాల్గొన్న వ్యాపారులు

లోగ్రేడ్.. నోబిడ్

సాగు తగ్గించాలనుకుంటున్నా..!



నేను గత ఏడాది 18 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయి. కూలీల కొరత కూడా ఎదురైంది. దీంతో ఈ సంవత్సరం ఇప్పటికే పచ్చాకు ముఠాలకు రూ.50వేలు అడ్వాన్స్ కూడా చెల్లించా. అయితే ప్రస్తుతం వేలం కేంద్రాల్లో ధరలు పడిపోయాయి. ఈ పరిణామాలతో వచ్చే సీజన్‌లో సాగు విస్తీర్ణం తగ్గించి బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పండించాలని నిర్ణయించుకున్నా.

- బొక్కిసం శేషయ్య, కట్టావారిపాలెం, కొండపి మండలం

పునరాలోచనలో పడ్డా



నేను గత ఏడాది 25 ఎకరాల్లో పొగాకు పండించా. అధికారిక పంట కొనుగోళ్ల సమయంలో మంచి ధరలు లభించాయి. దీంతో వచ్చే సీజన్‌లో సాగుకు ఇప్పటికే కొంత పొలాన్ని కౌలుకు తీసుకున్నా. అయితే అదనపు పంట కొనుగోళ్ల మొదలైన తర్వాత ధరలు పడిపోతున్నాయి. మరికొన్ని పరిణామాలు కూడా ముున్ముందు మార్కెట్‌పై అనుమానాన్ని రేకెత్తిస్తున్నాయి. దీంతో వచ్చే సీజన్‌లో సాగుపై పునరాలోచనలో పడ్డా.

- కొత్తపల్లి వెంకటేశ్వర్లు (గుణ), జమ్ములపాలెం, టంగుటూరు మండలం

మార్కెట్ ప్రారంభం నుంచి ఉన్న పొగాకు ధరలు ప్రస్తుతం దిగజారాయి. అదనపు పంట విక్రయాలకు కేంద్ర వాణిజ్యశాఖ అనుమతి ఇచ్చినప్పటి నుంచి మీడియం, లోగ్రేడ్‌ల రేట్లు భారీగా పడిపోయాయి. మేలు రకం పొగాకు ధర కూడా తగ్గింది. లోగ్రేడ్ అయితే ఏకంగా కేజీకి రూ.50పైనే దిగజారింది. దీంతో సాగుదారులు లబోదిబోమంటున్నారు. అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయిందన్న రైతుల సంతోషంపై వ్యాపారులు ధరలు తగ్గించి నీళ్లు చల్లారు. ఈ ప్రభావం వచ్చే సీజన్ సాగుపై పడింది. పొలాల కౌలు, బ్యారన్ అద్దెల విషయంలో రైతులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

నాణ్యత తక్కువ ఉన్న పొగాకు ధరలు పతనం

- కిలోకు రూ.50 వరకూ తగ్గుదల
- మేలురకం ధరలపై సీలింగ్
- ఉత్పత్తి తగ్గిన వారిలో ఆందోళన
- రైతుల్లో ఆనందం ఆవిరి

ఒంగోలు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్ల ముగింపు దశలో ధరలు బాగా ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం ఆయా గ్రేడ్లకు లభిస్తున్న రేట్లను చూసి వారు ఆందోళన చెందుతున్నారు. ఏ ఒక్క గ్రేడ్‌కూ గతంలో ఉన్న ధరలు లభించడం లేదు. లోగ్రేడ్ ధరలు పతనమవడంతోపాటు నోబిడ్లు భారీగా ఉంటున్నాయి. అధికంగా పండిన ఎఫ్-5 గ్రేడ్ ధరలు గత నాలుగైదు రోజులుగా కిలోకు సగటున రూ.50 వరకూ తగ్గిపోయాయి. అలాగే మేలురకం ధరలపైనా వ్యాపారులు సీలింగ్ పెట్టి కొనుగోలు చేస్తున్నారు. అధిక పంట ఉత్పత్తికి అపరాధ రుసుం రద్దుతో కొంత ఊరట కలుగుతుందని భావించిన రైతులు ధరల తగ్గుదలతో దిగాలు పడుతున్నారు. అధిక ఉత్పత్తిపై అపరాధ రుసుం తగ్గింపు ఉత్తర్వుల అనంతరం ధరలు పడిపోయాయి. అంతకు ముందు గ్రేడ్ ఏదైనా రేటు ఒకటే అన్న విధంగా మార్కెట్ సాగింది. మేలు, మీడియం రకం ధరలు కిలో రూ.360 నుంచి రూ.380 వరకూ పలికాయి. అధికశాతం ఆ గ్రేడ్ల ధరలు కిలో రూ.350పైనే ఉండగా లోగ్రేడ్‌ను సైతం కిలో రూ.270 వరకూ చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాటి ధరలు దక్కకపోవడమే కాక పలు వేలం కేంద్రాలలో లోగ్రేడ్ బేళ్లు భారీగా తిరస్కరణ (నోబిడ్)లు జరుగుతున్నాయి. గతంలో కిలో రూ.300కు అటు ఇటుగా ఉన్న మీడియం గ్రేడ్ ధర ప్రస్తుతం రూ.260 నుంచి రూ.270లోపు ఉంది.

ఎక్కువగా లోగ్రేడే వెనక్కి..

జిల్లాలో సోమవారం మార్కెట్‌ను పరిశీలిస్తే ఒంగోలు-1 కేంద్రానికి 1,540 బేళ్లు రాగా 1,229 కొనుగోలు చేశారు. అక్కడ 291 బేళ్లు నోబిడ్ అయ్యాయి. ఒంగోలు-2కు వెయ్యి బేళ్లు రాగా 170, టంగుటూరుకు 951 బేళ్లు రాగా 135, కొండపి కేంద్రానికి 1,085 బేళ్లు రాగా 206 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. తిరస్కరణలు జరుగుతున్న బేళ్లలో 95శాతం వరకు లోగ్రేడ్ ఉంటున్నాయి.

ఇదిలా ఉండగా ధరలు తగ్గిన నేపథ్యంలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ సోమవారం కొండపి, టంగుటూరు వేలంకేంద్రాలను సందర్శించారు. అక్కడ కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా లోగ్రేడ్ ధరల తగ్గుదల విషయాన్ని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం మీద వేలం ముగింపు దశ సమయంలో ధరలు పెరగాల్సింది పోయి తగ్గడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

డోలాయమానంలో రైతులు

పొగాకు సాగుకు పెట్టుబడి వ్యయం కూడా ఇబ్బడిముబ్బడిగా అవుతోంది. నారు నుంచి ట్రాక్టర్ బాడుగలు, కూలి రేట్లు, పొలాల కౌళ్లు, బ్యారన్‌ల అద్దెలు భారీగా పెరిగాయి. మంచి ధరలు లభిస్తుండటంతో రైతులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుత సీజన్‌లో కూడా ఇటీవల వరకూ రికార్డు స్థాయి ధరలు లభించాయి. వాటిని చూసి వచ్చే సీజన్‌కు రైతులు ముందస్తుగా పొలాలు, బ్యారన్‌లు లీజుకు తీసుకున్నారు. ఎకరా పొలానికి కౌలు రూ.25వేల నుంచి రూ.35 వేల వరకూ చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. బ్యారన్‌లను కూడా రెండున్నర లక్షల రూపాయల వరకు లీజుకు ముందుగానే తీసుకున్నారు. ఈదశలో గడచిన నెలరోజులుగా పొగాకు ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు తీసుకున్న పొలాల విషయంలో డోలాయమానంలో పడ్డారు. ఇప్పటికే భూములు ఇచ్చిన యజమానులు కూడా కౌలు తగ్గిస్తున్నట్లు సమాచారం.



కావాల్సింది ప్రక్షాళనే!

- పారిశుధ్య విభాగంలో చీపురు పట్టరు.. చెత్త ఎత్తరు!
- అక్రమ కట్టడాలకు టౌన్'ప్లానింగ్'
- రెవెన్యూలోనూ అవినీతి జలగలు
- నీటి సరఫరా అస్తవ్యస్తం.. ఇబ్బందిపెడుతున్న లీకులు
- ఒంగోలు కార్పొరేషన్‌లో ఇదీ పరిస్థితి
- నేడు నూతన కమిషనర్ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 27 : ఒంగోలు నగరపాలక సంస్థలో గత ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలన ఫలితంగా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. పురపౌరులకు పారదర్శక సేవలు ఐదేళ్ల నుంచి దూరమయ్యాయి. ప్రతి పనికీ మామూళ్లు నడిచాయి. ఒక్కమాటలో చెప్పుకుంటే ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ వాసన ఇంకా పోలేదు. ముఖ్యంగా పారిశుధ్య విభాగంలో పేరుకు కార్మికులు 650 మంది వరకు ఉన్నప్పటికీ సగం మంది చీపురు పట్టరు, చెత్త ఎత్తరు. అయితే అటెండర్లుగా, మేస్త్రీలుగా చెలామణి అవుతూ వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నారు. దీంతో నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం పనిచేసేవారు కరువయ్యారు. దీంతో వీధులన్నీ కంపుకొడుతున్నాయి.

అస్తవ్యస్తంగా నీటిసరఫరా, పౌరసేవలు

సచివాలయ వ్యవస్థలో ఒక్కో సచివాలయంలో పదిమంది వరకు సెక్రటరీలు ఉన్నారు. అలా నగరంలో 70కి పైగా సచివాయాల్లో 700 మంది వరకూ పనిచేస్తున్నారు. అయితే వీరు పౌరసేవల గురించి పెద్దగా పట్టించుకునే పరిస్థితి లేదు. మరోవైపు తాగునీటి సరఫరాను పర్యవేక్షించే ఇంజనీరింగ్ విభాగం పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లీకుల మోత, మోటార్ల మరమ్మతులు, ఇంకా పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్ల కొరత ఇలా రోజుకో సమస్యతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. కాగా ప్రభుత్వం మారింది, పాలకులు మారారు.. కానీ కార్పొరేషన్ సిబ్బంది పనితీరు మారలేదని కార్యాలయ పరిస్థితి చూస్తే అర్థమవుతుంది. ఈనేపథ్యంలో నగర నూతన కమిషనర్‌గా కోడూరి వెంకటేశ్వరరావు బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. తిరిగి గురువారం డీఎంఏ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరగనున్న కార్పొరేషన్, మునిసిపల్ కమిషనర్ల సమావేశంలో ఆయన పాల్గొంటారు.

రెవెన్యూ అంటేనే అవినీతి

రెవెన్యూ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. కొందరు ఆర్‌ఐలు వైసీపీ పెద్దల అండదండలతో ఆ సీట్లు దక్కించుకున్నారు. ఇష్టారీతిన ఇంటిపన్నులు వేసి వేలల్లో వసూలు చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంచితే అడిగినంత ఇవ్వకుంటే ప్లాను ఉన్నా అనధికార కట్టడంగా మార్చేసి ఇంటి యజమానికి చుక్కలు చూపించడం ఆనవాయితీగా మారింది. మరికొందరు చెప్పినంత ముట్టజెప్పకుంటే నెలలు గడిచినా పన్ను వేసే పరిస్థితి లేదు. మరోవైపు టౌన్ ప్లానింగ్‌లో ఇష్టారాజ్యమై పోయింది. ప్లాన్ ఇవ్వాలంటే పైసలు చెల్లించాల్సిందే. కార్యాలయంలోని కొందరు సిబ్బంది ఆశీస్సులు ఉంటే ప్లాను లేకపోయినా పక్కాగా భవనాలు నిర్మించుకునే పరిస్థితి ఉంది.

అవినీతికి అడ్డుకట్ట వేయాల్సిందే

కమిషనర్‌గా బాధ్యతలు చేపడుతున్న కోడూరి వెంకటేశ్వరరావు కార్పొరేషన్‌లోని ప్రతి సెక్షన్‌లోనూ మార్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. పారిశుధ్య విభాగంలో పూర్తిస్థాయిలో కార్మికులను పనికి కేటాయించాల్సిన అవసరం ఉంది. కార్యాలయంలో తిష్టవేసి, పనిచేయకుండా పెత్తనం చేయడానికి, ముొక్కుబడి సేవలకు పరిమితమైన వారిని ప్రక్షాళన చేయాల్సి ఉంది. అలాగే తాగునీటి సరఫరాలో లోపాలను సవరించి, సక్రమంగా నీరు అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు కార్పొరేషన్‌కు ఆదాయ వనరుగా ఉన్న రెవెన్యూ విభాగంలో 'గూడు'పుఠానీకి తెర తీసిన అవినీతి ఆర్‌ఐలను తొలగించి, పారదర్శక సేవలు అందించాల్సిన అవసరం కనిపిస్తోంది. నగరంలో అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 27 : సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలుపై సంబంధిత అధికారుల కమిటీతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పథకం ఉద్దేశాలు, లక్ష్యాలు, గృహాలు, కార్యాలయాలు, పరిశ్రమలలో సౌర విద్యుత్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు అనుసరించాల్సిన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

విధానాలను వివరించారు. దాని ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలను, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెం, తాళ్లూరు మండలం తూర్పుగంగవరం, పామూరు మండలం కంభాలదిన్నె, మార్కాపురం మండలం వేములకోట, జరుగుమల్లి మండలం పాలేటిపాడును ఈ పథకం కింద మోడల్ గ్రామాలుగా ఎంపికచేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రామాల్లో సత్వరమే సౌర విద్యుత్ వ్యవస్థను విస్తృతస్థాయిలో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపైనా వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సబ్సిడీ సొమ్మును కూడా త్వరగా జమచేసేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 15రోజులకు ఒకసారి ఈ పథకంపై సమీక్షిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎల్‌డీఎం డి.రమేష్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, జడ్పీ సీఈవో మాధురి పాల్గొన్నారు.



ఒంగోలులో మోటారు సైకిళ్ల ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ దామోదర్, సినీ నటుడు రఘుబాబు (ఇన్‌సెట్‌లో) సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న రోలర్



హెల్మెట్ ధరించండి.. పునర్జన్మ పొందండి!

- జిల్లావ్యాప్తంగా పోలీసుల అవగాహన కార్యక్రమాలు
- విద్యార్థులకు సదస్సులు, మోటారు సైకిళ్ల ర్యాలీలు
- ఒంగోలులో పాల్గొన్న ఎస్పీ దామోదర్, నటుడు రఘుబాబు
- సైలెన్సర్‌లను రోలర్‌తో తొక్కించిన ట్రాఫిక్ సిబ్బంది

లోపలి పేజీల్లో..

ముగిసిన బదిలీ దరఖాస్తుల స్వీకరణ

- డిప్యుటేషన్ల రద్దు విషయంలో నిర్లక్ష్యం
- ఏ గ్రేడు కార్యదర్శులను ఆ గ్రేడ్‌లోనే నియమించాలని ఉన్నతాధికారుల ఆదేశం

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 27 : జిల్లా పంచాయతీ కార్యాలయంలో బదిలీల దరఖాస్తుల స్వీకరణ గడువు మంగళవారంతో ముగిసింది. పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగులు, సిబ్బంది బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 31లోపు ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించడంతో అందుకనుగుణంగా పంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు డీపీవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం సాయంత్రంతో గడువు ముగిసింది. అయితే గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుత బదిలీల్లో ఏ గ్రేడు పంచాయతీ కార్యదర్శులను ఆ గ్రేడుల్లోనే నియమించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో సందిగ్ధం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది గ్రేడ్-3 వారు కూడా గ్రేడ్-1 పంచాయతీల్లో కార్యదర్శులుగా కొనసాగుతున్నారు. అటువంటి చోట ఉన్నతాధికారులు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులను మాత్రమే నియమించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఇప్పుడు ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

రద్దు కాని డిప్యుటేషన్లు

ప్రభుత్వం సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పంచాయతీరాజ్‌శాఖలో పనిచేసే ఉద్యోగుల డిప్యుటేషన్లను సంబంధిత అధికారులు రద్దు చేసి వారి పూర్వపు స్థానాలకు పంపాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రద్దు చేయలేదు. డీపీవో కార్యాలయంతోపాటు జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో సుమారు 60 మంది కార్యదర్శులు, సిబ్బంది డిప్యుటేషన్లపై కొనసాగుతున్నా వాటిని రద్దు చేయకపోవడంపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఒంగోలులో సర్దుబాటు రీకౌన్సెలింగ్

36 స్థానాలు భర్తీ, 12 మంది మిగులు టీచర్లు

ఒంగోలు(విద్య), ఆగస్టు 27: ఒంగోలు మండలంలో టీచర్ల పని సర్దుబాటు కౌన్సెలింగ్ మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయ ఆదేశాల మేరకు మంగళవారం ఉపాధ్యాయులకు రీకౌన్సెలింగ్ నిర్వహించారు. ఒంగోలు మండలంలో 48 మంది ఉపాధ్యాయులు మిగులుగా తేలగా 37 స్థానాల్లో అవసరమని గుర్తించారు. మొదట జరిగిన కౌన్సెలింగ్‌లో 34 స్థానాలు భర్తీ కాగా 14 మంది మిగిలారు. అయితే సీనియారిటీ జాబితాలో అవకతవకలు, మరికొన్ని అంశాలపై టీచర్ల నుంచి 14 అభ్యంతరాలు వచ్చాయి. వాటిలో కేవలం మూడు మాత్రమే పరిష్కారం కాగా, మిగిలిన 11 అంశాలను తిరస్కరించారు. ఈనేపథ్యంలో మొదట కౌన్సెలింగ్‌లో కోరుకున్న స్థానాలకు అందరూ అంగీకరించారు. గణితం అసిస్టెంట్ ఒకరు తనకు సీనియారిటీలో అన్యాయం జరిగిందని, తనకంటే జూనియర్‌ను జాబితాలో సీనియర్‌గా చూపించారని విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై డైరెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నోడల్ ఆఫీసర్, ఆర్‌జేడీలు కూడా రంగంలోకి వచ్చారు. ఒంగోలు ఎంఈవో టి.కిషోర్‌బాబు సీనియారిటీ విషయంలో తన తప్పిదం లేదని, తానుపెట్టిన గ్రీవెన్స్, వాట్సాప్ మెసేజ్‌లు చూపించి ఉన్నతాధికారులను ఒప్పించారు. దీంతో ఫిర్యాదుచేసిన టీచర్‌కు న్యాయం చేసేందుకు రీకౌన్సెలింగ్ నిర్వహించాలని ఎంఈవోను ఆదేశించారు. ఆయన కౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాటు చేశారు. 36 స్థానాలు భర్తీ చేయగా 12మంది మిగులుగా తేలారు. స్కూలు అసిస్టెంట్ హిందీ ఒక స్థానం మిగిలిపోయింది.

ప్రాణం ఎంతో విలువైనది!

ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలి : సినీ నటుడు రఘుబాబు ● హెల్మెట్‌పై నగరంలో అవగాహన ర్యాలీ

శబ్దకాలుష్యం చేసే సైలెన్సర్లను రోలర్‌తో తొక్కించిన ట్రాఫిక్ పోలీసులు ● డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని ఎస్పీ దామోదర్ పిలుపు



సభలో మాట్లాడుతున్న రఘుబాబు, పక్కన ఎస్పీ దామోదర్



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, యువత



రఘుబాబు : తమ్ముడూ..హెల్మెట్ పెట్టుకో..



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ దామోదర్, రఘుబాబు



సైలెన్సర్లను రోలర్‌తో తొక్కిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 27: ప్రాణం ఎంతో విలువైనదని, బాధ్యతారాహిత్యంతో వాహనాలు నడిపి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని సినీనటుడు రఘుబాబు పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు నగరంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగం-డ్రగ్స్‌తో ప్రాణాంతకం అనే అంశంపై అవగాహన ర్యాలీ, సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రఘుబాబు ముందుగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కొద్దిసేపు ట్రాఫిక్ విధులు నిర్వహించి వాహనదారులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల బారినుంచి బయట పడవచ్చని చెప్పారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారితో మాట్లాడారు. అనంతరం ఎస్పీ దామోదర్, రఘుబాబుతో పాటు పోలీసు అధికారులు హెల్మెట్లు ధరించి ద్విచక్రహనాలపై ర్యాలీ నిర్వహిచారు. పోలీసు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్, కొత్తపట్నం బస్టాండ్ నుంచి ప్రకాశంభవన్, నెల్లూరు బస్టాండ్ మీదుగా మినీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రఘుబాబు మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిభంధనలు పాటించి ప్రమాదాల బారినుంచి రక్షణ పొందాలని కోరారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి రహదారి నిబంధనలు పాటించాలని కోరారు. అదేవిధంగా యువత మత్తుకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడి పోలీసు రికార్డులకు ఎక్కితే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందలేరని స్పష్టం చేశారు. అనంతరం మినీ స్టేడియం వద్ద శబ్దకాలుష్యం చేసే సైలెన్సర్లను రోడ్డురోలర్‌తో తొక్కించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ క్రైమ్స్ శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, సీఐలు రాఘవేంద్రరావు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, సీఐ నాగరాజు, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో నేత్రదాన పక్షోత్సవాలు : డీఎంహెచ్‌వో



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో పద్మజ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 27 : జిల్లాలో ఈ నెల 25నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ తెలిపారు. మంగళవారం స్థానిక వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ నళితో కలిసి పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆప్తాల్మిక్ అధికారులతో జరిగిన సమావేశంలో పద్మజ మాట్లాడుతూ నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కళ్ళజోడు పెట్టుకున్నవారు, మధుమేహం, బీపీ, ఉబ్బసం వ్యాధులతో బాధపడేవారు, శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా నేత్రదానం చేయవచ్చని తెలిపారు. ఆయా అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని పద్మజ కోరారు. పక్షోత్సవాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

మహిళా సిబ్బంది సంక్షేమానికి కృషి : ఎస్పీ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 27: ప్రజాశేయస్సుకు పాటు పడే పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. మహిళా సిబ్బంది ఆరోగ్య సంరక్షణ కోసం మంగళవారం ఒంగోలులోని పోలీసు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేసే మహిళా సిబ్బంది ఆరోగ్య సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యహరించడం సరికాదని హితవు పలికారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం బాగుంటుందన్నారు. పోలీసుశాఖలో పనిచేస్తున్న మహిళా సిబ్బందితో పాటు పోలీసు కుటుంబాలలో మహిళలు పెద్ద ఎత్తున్న ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. 263 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రాఘవేంద్రరావు, వైద్యులు భానుమతి, ప్రతిమ, ఆంజనేయులు, భారతి, వెంకట రవీంద్రారెడ్డి, ముప్పల జోత్స్న, శ్యామసుందరి, వీరయ్యచౌదరి, సుబ్రహ్మణ్యేశ్వరి, సందీప్, జయశేఖర్, త్రిలోచనసాయి, దివ్య, 104 సిబ్బంది పాల్గొన్నారు.

అశ్రునయనాలతో డేవిడ్‌రాజు అంత్యక్రియలు





డేవిడ్‌రాజు అంత్యక్రియల్లో పాల్గొన్న మందకృష్ణ, కరణం బలరాం తదితరులు

నాగులుప్పలపాడు ఆగస్టు 27: అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. మంగళవారం మండలంలోని మట్టిగుంట గ్రామంలో పాలపర్తి డేవిడ్ రాజు అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిర్వహించగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, కాకుమాను రాజశేఖర్, కొమ్మూరి కనకారావు మాదిగ తదితరులు హాజరై భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. డేవిడ్‌రాజు పార్థీవదేహాన్ని మంద కృష్ణమాదిగ మోశారు.

నేడు పలు గ్రామాల్లో కరెంటు సరఫరా నిలిపివేత

మద్దిపాడు, ఆగస్టు 27: మండలంలోని పెద్దకొత్తపల్లి 11 కేవీ ఫీడర్‌లో బుధవారం విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నట్లు ఆశాఖ ఏఈ చెన్నారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఈ ఫీడర్ పరిధిలోని దొడ్డవరప్పాడు, నర్సాయపాలెం, మారెళ్లగుంటపాలెం, నేలటూరు, గురవారెడ్డిపాలెం, రుద్రవరం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రానైట్ కార్మికుడు ఆత్మహత్య

చీమకుర్తి, ఆగస్టు 27 : కంభంపాడు వద్ద ఉన్న గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలో పనిచేసే వలస కార్మికుడు, ఒడిశాకు చెందిన రంజన్ పాణిక్‌గ్రహి (31) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కృష్ణయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మద్దాలి'కి పొట్టి శ్రీరాములు పురస్కారం



పురస్కారంతో మాధవరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 27: శ్రీఅభయ సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాలి మాధవరావును హైదరాబాద్‌కు చెందిన ఎల్‌సీఎస్ ఫౌండేషన్ అమరజీవి పొట్టి శ్రీరాములు అంతర్జాతీయ స్ఫూర్తి సేవాపురస్కారంతో ఘనంగా సత్కరించింది. మంగళవారం ఒంగోలు నగరం అంజయ్యరోడ్‌లోని ఏకేవీకే కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూడ సురేష్‌బాబు, ఏషియన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ మన్నే మానస, డాక్టర్ చాపల వంశీకృష్ణ, కొత్తపట్నం తహసీల్దార్ పిన్నిక మధుసూధన్‌రావు చేతులమీదుగా పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా దాదాపు 4 వేల సేవాకార్యక్రమాలు నిర్వహించిన మాధవరావును సన్మానించటం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, సేవా సంస్థలు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు మాధవరావుకు అభినందనలు తెలిపారు.

ధాన్యం నిల్వలను పారదర్శకంగా ప్రకటించాలి

● జేసీ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 27: జిల్లాలోని రైస్ మిల్లర్లు పారదర్శకంగా ధాన్యం నిల్వలను వెల్లడించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మంగళవారం రైస్‌మిల్లర్ల యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిల్వ విషయంలో పొరపాట్లకు తావు లేకుండా వ్యహరించాలన్నారు. తనిఖీల సమయంలో నిల్వల విషయంలో తేడాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లుల్లో ఏ విధమైన రేషన్‌బియ్యం నిల్వ ఉంచకూడదని, అక్రమాలకు పాల్పడితే 6ఏ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. మిల్లర్లకు పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల బిల్లులను త్వరలో మంజూరు చేస్తామని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పౌరసరఫరాలశాఖ అధికారి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ దృష్టికి తీసుకొని వస్తే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డీఎస్‌వో ఉదయభాస్కర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు కేంద్ర ప్రభుత్వ పోర్టర్‌లో స్టాక్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు సమావేశంలో సీఎంఆర్ మిల్లుల అధ్యక్షుడు చుండూరి రవి, మిల్లర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, సహాయపౌరసరఫరాల అధికారులు పుల్లయ్య, రవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రైస్ మిల్లర్ల యజమానులు పాల్గొన్నారు.

పోరాటపటిమతోనే ఎస్సీ వర్గీకరణ సాధించాం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

నాగులుప్పలపాడు ఆగస్టు 27: ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అలుపులోని పోరాటం చేసిందని, ఈక్రమంలోనే సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇచ్చిందని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. మంగళవారం ఉప్పుగుండూరులోని జగజ్జీవన్‌రావు నగర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ళ సుదీర్ఘ పోరాటంలో ఎన్నో ఆటుపోట్లు, దాడులు సైతం ఎదుర్కొని ఉద్యమం కొనసాగించినట్లు చెప్పారు. తొలినాళ్లలో ఉద్యమానికి సహాయ సహకారాలు లేక ఎన్నో ఇబ్బందులు పడినట్లు తెలిపారు. తదనంతర పరిణామాల నేపథ్యంలో టీడీపీ నుంచి దివంగత మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ నుంచి చింతపల్లి పౌలు ఉద్యమానికి సహకారం అందించారన్నారు. మాదిగల ఆత్మగౌరవం నిలవాలని చెప్పులు కుట్టిన చేతులే చరిత్ర తిరగరాస్తాయని నినాదంతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం కొనసాగించి జాతీయ స్థాయిలో ఉద్యమ సత్తా చూపించగలిగామన్నారు. ఎంతో మంది మాదిగల బలిదానాలు, పోరాటస్ఫూర్తితో ఉద్యమాన్ని నడిపించి వర్గీకరణను సాధించకున్నట్లు మంద కృష్ణ వెల్లడించారు. ఈ విజయం మాదిగ జాతికి అంకితమన్నారు. దళిత వర్గాల్లోని అనేక కులాలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతుండగా, కొద్దిమంది మాత్రమే తమ స్వార్థప్రయోజనాల కోసం సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్‌డీఏ కూటమి సారథ్యంలో త్వరలోనే వర్గీకరణ ఫలాలను మాదిగ జాతి అందుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మున్నంగి నాగరాజుమాదిగ, భిక్షాలుమాదిగ, అలపాటి కరుణ, పాలడుగు రమేష్, మాదిగ ఉద్యోగసమఖ్య నాయకులు చిరువూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభిమానం వెలకట్టలేనిది..!

ఎమ్మెల్యే బీఎన్

4 కి.మీ పార్లుదండాలతో మొక్కు తీర్చుకున్న ఇలపావులూరు మాజీ సర్పంచ్



అంజయ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



పొర్లుదండాలు పెడుతూ మొక్కు తీర్చుకుంటున్న అంజయ్య

చీమకుర్తి, ఆగస్టు 27: తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కార్యదక్షత, చూపిన అభిమానం వెలకట్టలేనిదని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ గెలిచినందుకు చీమకుర్తి మండల ఇలపావులూరు మాజీ సర్పంచ్ మణిమేల అంజయ్య మంగళవారం తన మొక్కును తీర్చుకున్నారు. ఇలపావులూరు గ్రామం నుంచి దొడ్డవరంలో ఉన్న అంకమ్మతల్లి గుడి వరకు పొర్లుదండాలు పెడుతూ వెళ్లి అమ్మవారిని దర్శించుకొని తన మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఎమ్మెల్యే బీఎన్, తన గెలుపుకోసం ఎంతో కష్టమైన మొక్కును తీర్చుకున్న అంజయ్యను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రామవరావు, వేల్పుల శ్రీనివాసరావు, గమిని ప్రసాద్, ఆదిబాబు, సరికొండ చిరంజీవిరాజు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణజన్మాష్టమి



స్వామివారికి కల్యాణత్సోవం చేస్తున్న అర్చకులు

సంతనూతలపాడు, ఆగస్టు 27: సంతనూతలపాడులోని యాదవుల బజారులో సోమవారం రాత్రి ఘనంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. పండితుల ఆధ్వర్యంలో స్వామివారి ప్రవచనాలను భక్తులకు వినిపించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. అనతరం ఉట్టికొట్టే కార్యక్రమం జరిపారు. అలాగే ఆర్యవైశ్య కళ్యాణమండపంలో శ్రీకృష్ణజన్మాష్టమిని ఘనంగా నిర్వహించారు. యాదవసంఘం నాయకులు చీమకుర్తి ఎంపీపీ యుద్దనపూడి శ్రీను, రిటైర్డ్ తహసీల్దార్ అంకమ్మరావు, ఆర్.సురేష్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లును తదితరులను ఘనంగా సత్కరించారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు తప్పక ధరించాలి : ఎస్ఐ

మద్దిపాడు, ఆగస్టు 27: వేగం కన్నా ప్రాణాలు మిన్నని, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని ఎస్ఐ శివరామయ్య కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం మద్దిపాడులో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు కృష్ణ, వెంకటలక్ష్మి, సిబ్బంది ఉమామహేశ్వరరావు, రంగయ్య, సురేష్, తిరుపతి, కోటేశ్వరరావు, బుర్ర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు నిలుపుకోవడంతో పాటు, తోటి వారికి ఆదర్శంగా నిలవాలని ఎస్ఐ దేవకుమార్ తెలిపారు. కానిస్టేబుళ్లు సంతనూతలపాడులో హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి : హెల్మెట్ వినియోగంపై చీమకుర్తిలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్‌ను వాడాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మద్దిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ శివరామయ్య



సంతనూతలపాడులో..



చీమకుర్తిలో అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారావు

అవీ..ఇవీ..

నేడు డివిజన్ స్థాయి టీచర్ల సర్దుబాటు

ఒంగోలు(విద్య), ఆగస్టు 27: డివిజన్ స్థాయి టీచర్ల సర్దుబాటు కౌన్సెలింగ్ బుధవారం జరగనుంది. మండలాల్లో మిగులుగా తేలిన టీచర్లను భర్తీకాకుండా మిగిలిపోయిన పోస్టులు, సబ్జెక్టులవారీగా ఆయా విద్యా డివిజన్లకు ఉపవిద్యాధికారి లాగిన్లకు పంపారు. ఉపవిద్యాధికారులు లాగిన్లకు వచ్చిన మిగులు టీచర్ల సీనియారిటీ జాబితాలను డౌన్‌లోడ్ చేసుకొని బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చిన మిగులు టీచర్లలో కొందరికి మినహాయింపు ఇచ్చారు. మినహాయింపుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు డీఈవో కార్యాలయం నుంచి ఆర్‌జేడీ కార్యాలయానికి పంపుతారు. అక్కడ పరిశీలన అనంతరం పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడ ఆమోద ముద్రపడిన వారిని మిగులు టీచర్ల జాబితా నుంచి తొలగిస్తారు. ఒంగోలు విద్యాడివిజన్ పరిధిలో 22 మంది సబ్జెక్టు టీచర్లు మిగులుగా తేలగా, 150 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మినహాయింపులు పోను ఎంత మంది టీచర్లు మిగులుతారో, ఎన్ని పోస్టులు భర్తీ అవుతాయో బుధవారం తేలనుంది.

కారు ఢీకొని ఇరువురికి గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 27: కారు ఢీకొనడంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన వెల్లంపల్లి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. గుంటూరు వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో అద్దంకి పట్టణం భవానీ సెంటర్‌కు చెందిన పోలవరపు వెంకటరామయ్య, పోలవరపు చిన్నాకి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

బ్రాహ్మణులను ఆదుకోవాలి

మద్దిపాడు, ఆగస్టు 27: టీడీపీ కూటమి ప్రభుత్వం బ్రాహ్మణులను అన్ని విధాల ఆదుకోవాలని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నాభట్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడులో జరిగిన బ్రాహ్మన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించాలని, పేద బ్రాహ్మణులకు ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. దేవదాయశాఖ ద్వారా పౌరోహిత్యం చేసుకునేవారికి నెలకు రూ.15వేల భృతి అందించాలని కోరారు. కార్యక్రమంలో కొణిజేటి శివకుమార్, మహేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రావిడెంట్ ఫండ్‌పై అవగాహన



మాట్లాడుతున్న కమిషనర్ సతీష్‌కుమార్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 27 : ఉద్యోగులు, సంస్థల యాజమాన్యాలు, పెన్షనర్స్ నిధి ఆప్‌కే నిఖత్‌పై అవగాహన పెంచుకోవాలని ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కమిషనరు సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని ఉద్యోగుల భవిష్యతనిధి సంస్థ కార్యాలయంలో నిధి ఆప్‌కే నిఖత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ భవిష్య నిధిపై ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ పలు అంశాలు వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ, పి.మల్లిఖార్జునరావు, రామారావు, శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా నియోజకవర్గ కమిటీ

ఒంగోలు(విద్య), ఆగస్టు 27: ఏపీ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మా) ఒంగోలు నియోజకవర్గ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో కమిటీ గౌరవాధ్యక్షుడుగా సీహెచ్.మల్లికార్జునరావు, అధ్యక్షులుగా కె.మురళీకృష్ణ, కార్యదర్శిగా ఎ.వంశీకృష్ణ, కోశాధికారిగా షేక్ ధనూష్, ఈసీ సభ్యులుగా బి.శ్రీనివాసరెడ్డి, జె.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీ.సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు కొల్లా మాధవరావు, కార్యదర్శి వి.హనుమంతరావు, నియోజకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌స్కీంను పునరుద్ధరించాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 27 : కేంద్రం కొత్తగా తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్‌స్కీం, రాష్ట్రం తెచ్చిన గ్యారంటీడ్ పెన్షన్ స్కీంలను తాము ఆమోదించేది లేదని, అందువల్ల పాత పెన్షన్‌స్కీంను పునరుద్ధరించాలని ఐఫియా కౌన్సిలర్ పీవీ.సుబ్బారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గౌరవాధ్యక్షులు బి.వెంకట్రావు, బి.అశోక్‌కుమార్, ఎ.అమ్మయ్య మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించి మోసగించేందుకే కొత్త పెన్షన్ స్కీంలు తెస్తున్నాయని విమర్శించారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించకపోతే దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు.

సమాజాన్ని మేల్కొలిపే గీతాలు మరిన్ని రావాలి



గీతావిష్కరణలో పాల్గొన్న అతిథులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 27 : సమాజాన్ని మేల్కొలిపే గీతాలు మరిన్ని రావాలని రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో రూపొందించిన వైద్యాలయమా మగమృగాలమయమా అనే గీతాన్ని మంగళవారం స్థానిక మెడికల్ కాలేజీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థినులు సమాజంలో జరుగుతున్న పరిణామాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సమాజాన్ని ఆలోచింపచేసేలా రూపొందించిన గీతం రూకల్పన అభినందనీయమని చెప్పారు. ఈ సందర్భంగా గీత రచయిత్రి సింహాద్రి జ్యోతిర్మయి, ప్రజా గాయకుడు నూకతోటి శరత్‌లను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలరావు డాక్టర్ జాలాది మణిబాబు, తేళ్ళ అరుణ, నాళం నరసమ్మ, ఎడిటర్ షాన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రావెల్ టిప్పర్లు పట్టివేత

మద్దిపాడు, ఆగస్టు 27: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎస్సై శివరామయ్య మంగళవారం మద్దిపాడులో పట్టుకున్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్, ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

పూర్వ డీఎల్‌సీవోపై నేడు విచారణ

ఒంగోలు(విద్య), ఆగస్టు 27 : ఒంగోలు డిజనల్ కో ఆపరేటివ్ అధికారి(డీఎల్‌సీవో)గా గతంలో పనిచేసిన తోట సాయినాథ్ అక్రమాలు, అసభ్యప్రవర్తనపై బుధవారం ద్విసభ్య విచారణ కమిటీ విచారణ నిర్వహించనుంది. ఆయనపై అనేక ఆరోపణలు ఆవడంతో రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ బదిలీ చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ విచారణకు ఆదేశించారు. అయితే సాధారణ ఎన్నికల నేపథ్యంలో అప్పట్లో విచారణ ప్రారంభం కాలేదు. జిల్లా సహకాధికారి శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టాక ఇటీవల విచారణ ప్రారంభమైంది.

నూతన కార్యవర్గం



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 27: రూరల్ మెడికల్ ప్రాక్టీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులో మంగళావారం జరిగిన కమిటీ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా గుంటూరు భాస్కరరావు, బట్టు బాలాజీరావు, కందుకూరి రాజగోపాల్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా పెళ్ళూరి వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శిగా పెండెం వెంకటకృష్ణారావు, కోశాధికారిగా జానా శ్రీనివాసులును ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పి.నాగరాజు, అద్దంకి లెనిన్, ఆంటోనమ్మ, శాంతి, స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని మండపాల ఏర్పాటుకు నిబంధనలు

సంతనూతలపాడు, ఆగస్టు 27: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని విగ్రహ మండల కమిటీ సభ్యులకు ఎస్సై దేవకుమార్ మంగళవారం ఓప్రకటనలో పలు నిబంధనలు తెలిపారు. విగ్రహాలతో పాటు మండలపాల ఏర్పాటుకు ఐదుగురు లేదా అంతకన్న ఎక్కువమంది కమిటీగా ఏర్పడి వివరాలను పోలీస్టేషన్‌లో అందించి గుర్తింపుకార్డులను పొందాలి. ప్రైవేట్, పంచాయతీ, మున్సిపల్ స్థలాల్లో విగ్రహాల ఏర్పాటుకు స్థానిక సంస్థల అనుమతి తప్పనిసరి. అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అనుమతితో పందిళ్ల వద్ద ఇసుక, నీరును ఏర్పాటు చేసుకోవాలి. ఉత్సవాలు, నిమజ్జనం తేదీ వివరాలను తెలపాలి. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలకు వరకు మాత్రమే సౌండ్‌బాక్స్‌లు వినియోగించాలి. విగ్రహాలను రోడ్లపై ఏర్పాటు చేయకూడదు. బ్యానర్లు కట్టకూడదు. డీజేలకు అనుమతి లేదు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం

మంత్రి చొరవతో తీరుతున్న దీర్ఘకాలిక సమస్య

రూ.28లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు వెడల్పు

రెండోవైపు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్‌లైనుతో ఇబ్బందులు

వాటినీ మార్చాలన్న ప్రజల విజ్ఞప్తి

కొండపి, ఆగస్టు 27 : కొండపిలోని పోలీసు స్టేషన్ నుంచి స్టేట్ బ్యాంకు వరకూ ఉన్న రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసే పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.28లక్షలతో 135 మీటర్ల పొడవు, పది అడుగుల వెడల్పుతో దీన్ని నిర్మిస్తున్నారు. కొన్నేళ్లుగా వర్షాకాలంలో ఈ ప్రాంతంలో రోజుల తరబడి నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే అయిన మంత్రి స్వామి సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణాల వారు ఆక్రమించి తోలిన మెరకలు తొలగించకుండా, పూడ్చివేసిన సైడు కాల్వలు వెలికితీయకుండా రోడ్డు నిర్మాణం పూర్తి చేసినా ఉపయోగం ఉండదన్న అభిప్రాయానికి వచ్చారు. అనంతరం మెరకలను అధికారులు తొలగించారు. పూడ్చి వేసిన కాలువలను వెలికితీయించారు. దీంతో రోడ్డు వెడల్పు అయ్యింది. సైడు కాల్వలు ఎవరి దుకాణానికి ఎదురుగా వారు ఎత్తు పెంచి నిర్మించుకున్నారు. దీంతో రోడ్డు పనులు వేగవంతమయ్యాయి.


రెండో వైపు రోడ్డు వెడల్పునకు ఆటంకంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైను

పోలీస్ స్టేషన్ వైపు ఆటంకం

ఇప్పటికే రోడ్డుకు దక్షిణం వైపు 135 మీటర్ల పొడవులో సగం సీసీ రోడ్డు నిర్మాణాన్ని అధికారులు పూర్తి చేశారు. వచ్చే వారంలో మిగతా సగం కూడా పూర్తవుతుంది. ఆ వెంటనే రోడ్డుకు ఉత్తరం వైపు వెడల్పు చేసే పనులు ప్రారంభం కావాలి. అయితే ఈవైపు రోడ్డు వెంట విద్యుత్ లైను, రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. ఇవి తొలగించకపోతే నాలుగు అడుగులు కూడా వెడల్పు రాదు. ట్రాన్స్‌ఫార్మర్‌లలో స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్నది ప్రైవేటు వ్యక్తులది కావడంతో వారు తొలగించేందుకు సిద్ధమయ్యారు. పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న మరొకటి ప్రభుత్వ ట్రాన్స్‌పార్మర్. దీన్ని తొలగించాలంటే విద్యుత్ అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే ఈ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని, విద్యుత్‌లైను కూడా మార్చాలని ఏఈని లిఖితపూర్వకంగా కోరారు. అయితే ఇప్పటి వరకూ తొలగించలేదు. దీంతో పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉంది. ఈవిషయమై విద్యుత్ ఏఈ కుంచాల కోటయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆర్‌అండ్‌బీ అధికారులు తమకు ప్రత్యామ్నాయ స్థలం చూపించి విద్యుత్‌లైన్ షిఫ్టింగ్‌కు డబ్బులు కడితే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈప్రాంతంలో లోడు అధికంగా ఉంటుందని, సర్వీసులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ దృష్ట్యా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కాగా రోడ్డును పూర్తిస్థాయిలో వెడల్పు చేసేలా చర్యలు తీసుకొని రాకపోకలకు ఇబ్బంది లేకుండా మంత్రి చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కొండపిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

గంజాయి రవాణా ముఠా గుట్టురట్టు

ముగ్గురు యువకుల అరెస్టు.. 21 కిలోల సరుకు స్వాధీనం


మాట్లాడుతున్న సీఐ, పక్కన ఎస్సై

టంగుటూరు, ఆగస్టు 27 : గంజాయి రవాణా ముఠా గుట్టును టంగుటూరు పోలీసులు రట్టు చేశారు. ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. వివరాలను సింగరాయకొండ సీఐ హజరత్తయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన నాగరాజుకునిగల్ రంగప్ప, మైసూర్‌కు చెందిన మంచినపల్లి రివనరవికుమార్, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన గొర్లి గంగునాయుడు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు విశాఖ, ఒడిసా ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసి బెంగళూరు తరలించి అమ్ముతుంటారు. అలాగే సోమవారం ఒడిసాలో గంజాయిని కొనుగోలు చేసి రెండు ఆటోల్లో బెంగళూరుకు బయల్దేరారు. సమాచారం అందుకున్న సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై వి.నాగమల్లీశ్వరరావు సిబ్బందితో కలసి టంగుటూరు టోల్‌గేట్ సమీపంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు ఆటోల్లో 21 కిలోల గంజాయి పట్టుబడింది. వాటిలో ఉన్న రంగప్ప, రవికుమార్, గొర్లి గంగునాయుడును అరెస్టు చేశారు. వారిని విచారించగా గంజాయిని బెంగుళూరులోని చెంచునారాయణరెడ్డికి అమ్మేందుకు తరలిస్తున్నట్లు తేలింది. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.11.05లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. దాన్ని స్వాధీనం చేసుకొని ఆటోలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

వాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, ఆగస్టు 27 : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర సూచించారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయం నుంచి ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కందుకూరు రోడ్డు కూడలిలో సీఐ, ఎస్సై మాట్లాడారు. హెల్మెట్ వాడకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోలు బంకు స్థలాన్ని పరిశీలించిన జేసీ


ప్రతిపాదిత ఫిల్లింగ్ స్టేషన్ పత్రాలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ, అధికారులు

సింగరాయకొండ, ఆగస్టు 27 : కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ వరకూ బీపీసీఎల్ పెట్రోల్ పైపులైన్ నిర్మిస్తోంది. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధి సర్వే నెంబర్ 470/3లోని 0.61 సెంట్ల ప్రభుత్వ భూమిలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేసుకొనేందుకు కంపెనీ అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో జేసీ గోపాలకృష్ణ ఆభూమిని అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అందుకు సంబంధించిన పత్రాలను చూశారు. ఆయన వెంట ఆర్డీవో సుబ్బారావు, తహసీల్దార్ రవి, ఆర్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు


దర్గా వద్ద నేతలు

తర్లుపాడు, ఆగస్టు 27: తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు దర్గాలో ప్రసిద్ధి గాంచిన కాశింస్వామికి ఉమ్మడి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు తుమ్మలచెరువు దర్గాలో నాయకులు టీడీపీ అఖండ మెజార్టీ సాధించాలని మొక్కుకున్నారు. ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించడంతో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బోలా వీరాంజనేయులు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్యయాదవ్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, దామచర్ల సత్యలు కాశింస్వామికి మొక్కులు తీర్చుకున్నారు

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎన్నికల హామీ మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యం

రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి, స్వామి


మాట్లాడుతున్న మంత్రులు స్వామి, రవికుమార్, వేదికపై ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఉగ్ర

మార్కాపురం, ఆగస్టు 27: జర్నలిస్టుల సంక్షేమానికి తాము, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. స్థానిక కళాశాల రోడ్డులోని మాధవి గ్రాండ్‌ఇన్‌లో మంగళవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు గొట్టిపాటి, స్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులపై ఇష్టారీతిన దాడులు జరిగాయన్నారు. అక్రమ కేసులు కూడా బనాయించి జైళ్లపాలు చేశారని చెప్పారు. మీడియా సంస్థలను, యాజమాన్యాలను వేధింపులకు గురిచేసిందన్నారు. చివరికి అక్రిడిటేషన్ అందజేయడంలో కూడా జగన్ ప్రభుత్వం జర్నలిస్టులపై కక్షపూర్తింగా వ్యవహరించిందని చెప్పారు. కలెక్టరేట్‌లలో సమీక్షలకు జర్నలిస్టులకు ప్రవేశం లేకుండా చేశారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జర్నలిస్టులను అన్ని విధాలా ఆదుకుందని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, ఇంటిస్థలాలు, గృహనిర్మాణం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యమని చెప్పారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మాగుంట కుటుంబానికి జర్నలిస్టులకు మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తీవ్రంగా పోరాడామన్నారు. తాము గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినా హామీలు ఇచ్చారే కానీ అమలు చేయలేదని చెప్పారు. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి సమస్యను తీసుకుపోనున్నామన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని, సంక్షేమానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురంలో ఇప్పటికే పాత్రికేయుల ఇళ్లస్థలాల సమస్యలను తాను పరిష్కరించానన్నారు. కొత్తగా వచ్చిన జర్నలిస్టులకు కూడా త్వరలో ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు, గృహనిర్మాణం జరిగేలా తప్పక కృషి చేస్తానని అన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమాజాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల బాధ్యత చాలా గొప్పదని తెలిపారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల కష్టాలు తమకు తెలుసని, ఈ ప్రభుత్వం వారి అభివృద్ధికి పాటుపడుతుందని చెప్పారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ పాత్రికేయులు వార్తలకు విశ్వసనీయత పెంచేలా వార్తలు ప్రచురించాలని సూచించారు. దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబులు మాట్లాడుతూ నిబద్ధతతో జర్నలిస్టులు పనిచేసి సమాజం బాగుపడే విధంగా కృషి చేయాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అలుగుల సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ కార్యక్రమం అనంతరం మంత్రులతోపాటు ముఖ్య అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీవీ కృష్ణారెడ్డి, శాసనాల వీరబ్రహ్మం, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, సీపీఎం నాయకులు డి.సోమయ్య పాల్గొన్నారు.


జర్నలిస్టుల సమస్యలపై మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు

భూముల ఆక్రమణలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గోకులం గ్రామస్థులు

వెలిగండ్ల, ఆగస్టు 27: వైసీపీ ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. మండలంలోని మొగళ్ళూరు రెవెన్యూ పరిధిలో వైసీపీ నాయకులు అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించారు. చెట్లను నరికి సొమ్ము చేసుకున్నారు. ఈమేరకు మంగళవారం గోకులం గ్రామస్థులు తహసీల్దార్ సువర్ణకు ఫిర్యాదు చేశారు. 334-1, 334-2, 335-1, 335-2, 336 గల సర్వే నెంబర్లలో 54 ఎకరాల అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని రైతులు సందడి మస్తాన్ రెడ్డి, శ్రీనివాసులు, రమణయ్య, ఆదినారాయణ, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, తిరుపతయ్య ఫిర్యాదు చేశారు.భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని అగ్రిగోల్డ్ భూములకు రక్షణ కల్పించాలని తహసీల్దార్‌ను కోరారు

నేటి నుంచి పొగాకు బ్యారన్‌ల రిజిస్ట్రేషన్లు

కొండపి, ఆగస్టు 27 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో 2024-25 సంవత్సరం పంట కాలానికి పొగాకు బ్యారన్‌ల రిజిస్ట్రేషన్ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం వరకు పొగాకు కొనుగోళ్లు జరుగుతాయని, ఆతర్వాత బ్యారన్‌ల రిజిస్ట్రేషన్‌లను సిబ్బంది చేస్తారని ఆయన వివరించారు.

సింథైట్ ఫ్యాక్టరీలో ఆకస్మిక తనిఖీ

కమిటీ అనుమతి లేకుండా ఎలా నడుపుతారని నిలదీత

మేదరమెట్ల, ఆగస్టు 27 : మేదరమెట్లలోని సింథైట్ ఫ్యాక్టరీలో పొల్యూషన్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో మిరపకాయలు పొడి చేసే యూనిట్ నడపం పట్ల ఈఈ రాఘవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ నియమించిన కమిటీ ఆదేశాలు లేకుండా ఎలా నడుపుతారని ఆయన ప్రశ్నించారు. ట్రైయిల్ రన్ మాత్రమే చేస్తున్నామంటూ ఫ్యాక్టరీ అధికారులు అధికారులకు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మిరపకాయలు పొడి చేసే బాయిలర్ యూనిట్‌ను పరిశీలించారు. అక్కడ కొత్తగా చేస్తున్న నిర్మాణాలను గురించి అధికారులు వివరించారు. మిరపకాయలు పొడి చేసే యూనిట్ నుంచి బయటకు వచ్చే గాలిని గతంలో గాలిలోకి వదిలేసేవారు. ఇటీవల కమిటీ సందర్శించిన తరువాత అక్కడ చేస్తున్న కొత్త నిర్మాణాలను అధికారులకు వివరించారు. గాలిలోకి కలువకుండా ఆ యూనిట్ నుంచి వచ్చే వ్యర్థాలను అక్కడ ఏర్పాటు చేసిన నీటి ట్యాంక్‌లలోకి పెట్టిన విధానాన్ని చూపించారు. కమిటీ అనుమతి లేకుండా మిరపకాయలను పొడిచేసే విభాగాలను నడపడానికి వీలు లేదని రాఘవరెడ్డి ఆదేశించారు. అక్కడ పెద్ద మొత్తంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న మిరపకాయల పొడి ఉండడం ఫ్యాక్టరీ నడుస్తున్నదానికి నిదర్శం. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరావుతో పాటు ఆర్ఐ పోతురాజు, వీఆర్‌వో రాజశేఖర్‌రెడ్డి, సింథైట్ అధికారులు పాల్గొన్నారు.


ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న అధికారులు

'మోపాడు' ఆధునికీకరణ పనులు


మోపాడు రిజర్వాయర్ తూము గేటును బిగిస్తున్న దృశ్యం


నూతనంగా తయారు చేయించిన రిజర్వాయర్ తూము గేటు

ప్రధాన కాలువ తూము గేటు ఏర్పాటు

పామూరు, ఆగస్టు 27: మండలంలోని మోపాడు రిజర్వాయర్ ప్రధాన కాలువ తూము గేటును ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పా టుచేశారు. జైకో నిధులతో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో భాగంగా మోపాడు రిజర్వాయర్ తూము గేటు పనులు ప్రారంభించారు. బ్రిటీష్ హయాంలో నిర్మించిన మోపాడు రిజర్వాయర్ గేటు తూము 120 సం వత్సరాల అనంతరం మరమ్మతులకు గురయింది. దీంతో రిజర్వాయర్ లోని నీరు లీకేజీ అవుతూ నీరు వృధాగా బయటకు పోతున్నది. ఈనేప థ్యంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో నూతన గేటు ని ర్మాణ పనులు విజయవాడలో పూర్తి చేయించారు. ఈ గేటును విజయవాడ నుంచి ప్రత్యేక వాహనంలో మోపాడుకు తెప్పించి యంత్రం సహా యంతో బిగింపు చర్యలు చేపట్టినట్లు ఇరిగేషన్‌శాఖ సిబ్బంది తెలిపారు. ఎన్నో ఏళ్లనుంచి తూముకు నూతనంగా గేటు నిర్మించాలన్న ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను ఉగ్ర ఆదేశాలతో కార్యరూపం దాల్చడంతో ఆయకట్టుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జైకో నిధులతో ఇప్పటికే ప్రధాన కాలువలపై నాలుగుచోట్ల బ్రిడ్జి నిర్మాణం, సిమెంట్ కాంక్రీట్ పనులు జరు గుతున్నాయి. రిజర్వాయర్ వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలో రిజర్వాయర్ లోపలి భాగంలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేప ట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పెద్దయాచవరంలోని రైతు సేవాకేంద్రం

యంత్రసేవా కేంద్రాలు కనుమరుగు

- నాడు వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లిన ప్రభుత్వం రాయితీ
- నేడు గ్రామాల్లో మచ్చుకకు కానరాని కేంద్రాలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 27: గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల కోసమంటూ ఏర్పాటు చేసిన యంత్రసేవ పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా రైతు భరోసా కేంద్రాల్లో యంత్రసేవా కేంద్రాలను (కస్టమర్ హైరింగ్ సెంటర్)లను ప్రారంభించింది. ప్రస్తుతం అవి గ్రామాల్లో మచ్చుకు కూడా కనిపించడం లేదు.

ఈ పథకం ద్వారా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉండే రైతులకు పంటలు సాగు చేసుకునేందుకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఎక్కువ అద్దెలు చెల్లించి నష్టపోకుండా ఉండేందుకు గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అంతవరకు ప్రభుత్వ ఉద్దేశం బాగానే ఉన్నప్పటికీ వైసీపీ నాయకులు ఈ పథకంలో కూడా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. ఒక్కొక్క యంత్రసేవా కేంద్రం మంజూరు చేసి ఒక్కొక్క యూనిట్‌కు గరిష్ఠంగా రూ.15లక్షలు వరకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేసుకు నేందుకు అవకాశం కల్పించింది. యంత్రసేవ యూనిట్ రైతుసేవా కేంద్రం పరిధిలో ఐదు లేదా ఆరుగురు ఒక సంఘంగా ఏర్పాటై సంఘం పేరుతో ఖాతాను ప్రారంభించి రిజిస్టర్ చేసుకుంటారు. బ్యాంకు ఖాతాలో వీరు కొనుగోలు చేసేందుకు ఎంచుకున్న కంపెనీ ఖాతాకు బ్యాంకు ద్వారా 10 శాతం నగదును డిపాజిట్ చేస్తారు. ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్ల యంత్రాల కొనుగోలుకు బ్యాంకు నుంచి 50 శాతం రుణం, 40 శాతం ప్రభుత్వం రాయితీని వారి ఖాతాల్లో జమ చేస్తారు. మండలంలో మొత్తం 24 రైతుసేవా కేంద్రాలు ఉండగా 23 కేంద్రాలకు యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్లు వ్యవసాయ పనిముట్లను ఆయా కేంద్రాల పరిధిలోని కొనుగోలకు గత ప్రభుత్వం రాయితీని మంజూ రు చేసింది. ఈ సేవా కేంద్రాల ద్వారా ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలను రైతుభరోసా కంద్రాల వద్ద ఆ గ్రామాల పరిధిలో ఉన్న సన్న చిన్నకారు రైతుల కోసం అందుబాటులో ఉండాలి. వీటిని రైతులకు గ్రామంలో తక్కువ అద్దెకు ఇవ్వాలి.

వైసీపీ నాయకులు ప్రభుత్వం ద్వారా 40 శాతం రాయితీని వారి ఖాతాల్లో జమ చేసిన వెంటనే ప్రభుత్వం యంత్రసేవా పథకం ద్వారా మంజూరు చేసిన ట్రాక్టర్, వ్యవసాయ ఉపకరణాలను రైతుసేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుసేవా కేంద్రాల వద్ద యంత్రసేవా యూనిట్‌కు మంజూరైన ఉపకరణాలను రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి. కానీ మంజూరు చేయించుకున్న వైసీపీ నాయకులు వారి సొంత పనులకు మాత్రమే వాటిని ఉపయోగించుకుంటున్నారు. మండలంలోని ఇడుపూరు, పట్టణంలోని మూడు రైతుసేవా కేంద్రాల్లో మంజూరైన ట్రాక్టర్లు, వ్యవసాయాంత్రాలను రైతులకు అందుబాటులో ఉంచకుండా మరో ప్రైవేట్ వ్యక్తులకు అద్దెలకు చెల్లిస్తూ లాభాలు పొందుతున్నారు. మరికొందరు మరొకరకి ట్రాక్టర్, యంత్రాలను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన యంత్ర సేవ పథకం వైసీపీ నాయకుల జేబులు నింపేందుకే ఉపయోగించుకున్నారని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు యంత్రసేవ కేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్, ఇతర ఉపకరణాలను రైతుసేవా కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండలంలో మొత్తం 24 రైతుసేవా కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో 23 రైతుసేవా కేంద్రాలలో యంత్రసేవా కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వం యూనిట్లను మంజూరు చేసింది. 23 రైతు సేవా కేంద్రాలలో యంత్రసేవా కేంద్రాలను మొత్తం రూ.2.20కోట్లు ట్రాక్టర్, వ్యవసాయ యంత్రాల కొనుగోలకు మంజూరు చేసింది. మండలంలో మంజూరైన మొత్తం 23 యంత్ర సేవా కేంద్రాలకు రూ.88.41లక్షల రాయితీని గత ప్రభుత్వం మంజూరు చేసింది. మంజూరైన రాయితీ నగదును యంత్ర సేవ యూనిట్ల ఖాతాలలో నగదును జమ చేసింది. రాయితీ పొందిన ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలను ప్రస్తుతం అందుబాటులో ఉంచడం లేదు. వైసీపీ నాయకులు ట్రాక్టర్లను, వ్యవసాయ యంత్రాలను వారి సొంత పనులకు ఉపయోగించుకంటూ కాంట్రాక్టర్ల వద్ద ఉంచుతూ వాటితో వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరు రాయితీ ద్వారా తీసుకున్న టాక్టర్లు, వ్యవసాయంత్రాలను అమ్ముకుంటున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

అవీ..ఇవీ..

పీఎం జన్మన్‌తో మౌలిక వసతులు

- నోడల్ అధికారి ధనుంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి ధనుంజయ్

పెద్దదోర్నాల, ఆగస్టు 27: ప్రధానమంత్రి జన్మన్ కార్యక్రమం ద్వారా గిరిజనులకు 11 రకాల వసతులు లభిస్తాయని మండల నోడల్ అధికారి కే.ధనుంజయ్ అన్నారు. మండలంలోని పనుకుమడుగు గిరిజన గ్రామంలో పీఎం జన్మన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో నాసర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ధనుంజయ్ మాట్లాడుతూ పీఎం జన్మన్‌లో భాగంగా చెంచుగిరిజనులకు పక్కాగృహాలు, నీటికొళాయి ఏర్పాటు, గ్రామాలకు రహదారుల నిర్మాణం, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తారన్నారు. నాణ్యమైన విద్యను అందించడం, నైపుణ్యవికాసం కల్పించడం, పౌష్టికాహారం అందించి తద్వారా ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడం, జీవనోపాధులు మెరుగుపరచడం వంటి బృహత్తర పథకాలు గిరిజనులకు చేరువ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గిరిజన గ్రామంలో ఈ పథకాలు అమలవుతాయన్నారు. ఈ పథకాలను సద్వినియోగపర్చుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంటు షేక్ లాలఅహ్మద్, దోర్నాల ఈవో మోహన్‌రావు, వెలుగు కోఆర్డినేటర్ కే.మోహన్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో కుంకుమార్చన

గిద్దలూరు, ఆగస్టు 27 : పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ముగిశాయి. చివరి రోజు మంగళవారం సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. మహిళ భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు ఒ.వెంకటయ్య, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణయ్యశెట్టికి ఘన నివాళి



కృష్ణంశెట్టి చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఆవోపా ప్రతినిధులు

గిద్దలూరు, ఆగస్టు 27 : ఆవోపా వ్యవస్థాపకులు క్రిష్ణయ్యశెట్టి వర్ధంతి సందర్భంగా స్థానిక అమ్మవారిశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆవోపా సంస్థను ఏర్పాటు చేసి వివిధ రకాల సేవా కార్యక్రమాలు ఆర్యవైశ్యులకు అందించిన కృష్ణయ్యశెట్టి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షులు దారా రాములు, అమ్మవారిశాల అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, ఆవోపా ప్రతినిధులు శివపురం పీరయ్య, బి.లక్ష్మయ్య, ఎం.రంగయ్య, కె.పిచ్చయ్య పాల్గొన్నారు.

ప్రాణం ఎంతో విలువైనది : రఘుబాబు



మాట్లాడుతున్న రఘుబాబు, ఎస్పీ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 27: ప్రాణం ఎంతో విలువైన దని, బాధ్యతారాహిత్యంతో వాహనాలు నడిపి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని సినీనటుడు రఘుబాబు పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు నగరంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగం-డ్రగ్స్‌తో ప్రాణాంతకం అనే అంశంపై అవగాహన ర్యాలీ, సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రఘుబాబు ముందుగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కొద్దిసేపు ట్రాఫిక్ విధు లు నిర్వహించి వాహనదారులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల బారినుంచి బయట పడవచ్చని చెప్పారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వా రితో మాట్లాడారు. అనంతరం ఎస్పీ దామోదర్, రఘుబా బుతో పాటు పోలీసు అధికారులు హెల్మెట్లు ధరించి ద్విచక్రహనాలపై ర్యాలీ నిర్వహిచారు. పోలీసు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్, కొత్తపట్నం బస్టాండ్ నుంచి ప్రకా శంభవన్, నెల్లూరు బస్టాండ్ మీదుగా మినీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రఘుబాబు మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల బారినుంచి రక్షణ పొందాలని కోరారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమా దాలలో ఎక్కువ మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి రహదారి నిబంధనలు పాటించాలని కోరారు. అదేవిధంగా యువత మత్తుకు బానిసలై జీవితా లు నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడి పోలీసు రికార్డులకు ఎక్కితే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందలేరని స్పష్టం చేశారు. అనంతరం మినీ స్టేడియం వద్ద శబ్దకాలుష్యం చేసే సైలెన్సర్లును రోడ్డురోలర్‌తో తొ క్కించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ క్రైమ్స్ శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, సీఐలు రాఘవేంద్రరావు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, సీఐ నాగరాజు, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేశప్రగతికి మాదకద్రవ్యాలు ప్రమాదకరం



మాట్లాడుతున్న శేషుకుమార్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 27: యువత మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలు కావడం దేశప్రగతికి ప్రమాదకరం అని స్టూడెంట్ యాక్టివిటీ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ ఎం.శేషుకుమార్ అన్నారు. డ్రగ్స్ నిరోధక కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతుల సూచన మేరకు నిర్వహించిన ఈ ప్రత్యేక సదస్సుకు డ్రగ్స్ నిరోధక కమిటీ కళాశాల కన్వీనర్ ఎం.రాఘవేంద్ర నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషుకుమార్ మాట్లాడుతూ.. భారతదేశం గొప్ప యువశక్తి గల దేశమన్నారు. ప్రపంచ జనాభాలో మన దేశ యువశక్తికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉన్నాయన్నారు. అగ్రదేశాలన్నింటిలోనూ, ఉద్యోగాలలోనే గాక వ్యాపార, వాణిజ్య రంగాలలో భారతీయ యువతకే అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఇటువంటి యువత విదేశీ నాగరికత తాలుకా విశృంకలతలతో పెడదారి పట్టించటం విచారకరం అన్నారు. మత్తు బలహీనతలు యువతకు సరదాగా ప్రారంభమ వుతాయని, సిగరెట్ ఆల్కహాల్‌తో మొదలై గంజాయి, ఓపీఎం తదితర మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూధన్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకం వల్ల ఎన్నో అనార్థాలు జరగుతాయన్నారు. మృగంలా ప్రవర్తిస్తూ, అనేక విద్రోహాలకు కారణమం అవుతారన్నారు. వివిధ అంశాలను వివరించారు.

ప్రైవేటు పాఠశాలల యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ

ఎర్రగొండపాలెం, ఆగస్టు 27 :ఎర్రగొండపాలెం నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల యూనియన్ నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షులు సాలిగ్రామ్ తెలిపారు. అధ్యక్షులుగా ఎం.చెన్నారెడ్డి, (సిద్ధార్థస్కూల్ కుంట), ఉపాధ్యక్షురాలుగా ఎం.పద్మజ, (నలందస్కూల్ ఎర్రగొండపాలెం), కార్యదర్శిగా ఎం.మల్లికార్జున, (హర్షస్కూల్, దోర్నాల), సహాయకార్యదర్శిగా ఎం రమణయ్య, (రవీంద్ర స్కూల్ దోర్నాల), కోశాధికారిగా ఎం.వెంకటేశ్వర రెడ్డి, (గౌతంబుద్ధస్కూల్ చందవరం), మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రహదారిని శుభ్రం చేయించిన సిబ్బంది

- ఆంధ్రజ్యోతి కథనానికి అధికారుల స్పందన



వీధులు, కాలువలు శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎర్రగొండపాలెం, ఆగస్టు 27 : ఎర్రగొండపాలెం మేజరు పంచాయతీలో శివాలయం వీధిలోరహదారిపై నిల్వ ఉన్న మురికి నీటిని, బురదమట్టిని మంగళవారం పంచాయతి అధికారులు స్పందించి శుభ్రం చేయించారు. ఎర్రగొండ పాలెం నుంచి వెళ్లే జాతీయ రహదారి నుంచి ఎర్రగొండపాలెం పాతఊరిలోకి వెళ్లడానికి అను సంధానంగా ఉన్న అంతర్గత రహదారి కావడంతో ప్రజలు ఎక్కువగా ఆ రహదారి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం కురిసిన ప్రతి పర్యాయం ఈ రహదారిపై నీళ్లనిల్వ ఉండి, బురద మట్టి ఏర్పడి ప్రజల రాక పోకలకు అసౌకర్యంగా ఉంది. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నీటి కుంటలను తలపిస్తున్న అంతర్గత వీధులు' అన్న శీర్షికన వార్త కథనం ప్రచురితమైనది. ఈ కథనానికి స్పందించిన టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. దీంతో పంచాయతి కార్యదర్శి రాజశేఖరరెడ్డి ఈ దారిని పంచాయతి కార్మికులతో శుభ్రం చేయించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

త్రిపురాంతకం, ఆగస్టు 27: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30న శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. ఎంపీపీ గొట్టిముక్కల రిబకమ్మ సమావేశానికి అధ్యక్షత వహిస్తారన్నారు. మండలంలోని అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని తెలిపారు.

కులమతాలకు అతీతంగా ప్రేమను పంచాలి

గిద్దలూరు, ఆగస్టు 27 : పట్టణంలోని కల్వరిమౌంట్ చర్చిలో పాస్టర్ల సమావేశం నిర్వహించారు. నేషనల్ ఇండిపెండెంట్ బిషప్స్ కౌన్సిల్ అధినేత డాక్టర్ మార్టిన్ మాట్లాడుతూ కులమతాలకు సంబంధం లేకుండా ప్రేమను ప్రతి ఒక్కరికి పంచాలన్నారు. సమాజంలో నీతిమంతంగా జీవించే విషయం గురించి ప్రజలకు తెలియచెప్పాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు, బిషప్‌లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, ఆగస్టు 27 : ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొనే సమస్యల గురించి తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఈ నెల 28న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 9959225702 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలియజేయాలన్నారు.

మొక్కులు తీర్చుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

తుమ్మలచెరువు దర్గాలో ప్రత్యేక పూజలు



మొక్కు చెల్లించేందుకు హాజరైన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు నేతలు

తర్లుపాడు, ఆగస్టు 27: తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు దర్గాలో ప్రసిద్ధి గాంచిన కాశీంస్వామికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు తుమ్మలచెరువు దర్గాలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నాయకులు టీడీపీ అఖండ మెజార్టీ సాధించాలని మొక్కుకున్నారు. ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించడంతో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బోలావీరాంజనేయులు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్యాయాదవ్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, దామచర్ల సత్యలు కాశీంస్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా అగ్నిగుండం, దర్గా చుట్టూ మూడుసార్లు ప్రదర్శనలు చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముజావర్లు స్వామివారి దారులను ఎమ్మెల్యేలు, మంత్రులకు అందించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులకు డప్పువాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాసపతిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, బొంబాయ్ కాశీం, పి.గోపినాథ్ చౌదరి, రోశప్ప నాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతోనే ప్రాణాలకు రక్షణ

మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు



హెల్మెట్ ధరించి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మార్కాపురం, ఆగస్టు 27: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారానే ప్రాణాలకు రక్షణ ఉంటుందని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో మంగళవారం సాయంత్రం పోలీసులు హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో తలకు గాయం కావడంతోనే ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. వాటిని నివారించాలంటే ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించడమే పరిష్కార మార్గమన్నారు. కార్యక్రమంలో టౌన్, రూరల్, ట్రైనీ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, రాజమోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు : వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేందుకు విధిగా హెల్మెట్‌ను ధరించాలని గిద్దలూరు సీఐ రామకోటయ్య అన్నారు. మండలంలోని తాటిచర్ల మోటులో వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన, బైక్‌పై హెల్మెట్ ధరించి ర్యాలీ కార్యక్రమాన్ని గిద్దలూరు సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై మధుసుదన్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ రామకోటయ్య మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడుపుతున్న ప్రతి వాహనదారులు విధిగా హెల్మేంట్‌ను ధరించి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. వాహనదారులు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్న ఎక్కువ మంది హెల్మేట్ ధరించకపోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయన్నారు. అందుకు జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాలతో వాహనదారులకు అవగాహన కార్యాక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాహనదారులు తమ వాహనం నడిపే సమయంలో తమ కుటుంబం గురించి ఆలోచించి వాహనాలను నడపాలన్నారు. కొన్ని కారణాలచేత రోడ్డు ప్రమాదాల్లో కొందరు మరణించి ఆకుంటుబాలు వీధిన పడ్డ ఘటనలు మనం నిత్యం చూస్తున్నామన్నారు. అలా ఏ కుటుంబం రోడ్డు మీద పడకుండా ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. రోడ్డు ప్రమా దాల నివారణకు మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మేంట్ ధరించడం, అతివేగంగా ప్రయాణించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యాక్రమంలో పోలీసులు, వాహన దారులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ చేస్తున్న అర్బన్ సీఐ సురేష్

గిద్దలూరు టౌన్ : హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణనష్టాన్ని నివారించవచ్చని, అర్బన్ సీఐ కె.సురేష్ అన్నారు. మంగళవారం హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తూ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు హెల్మెట్లతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువవుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించక ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిపారు. హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు.

కంభం : ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్లు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని కంభం ఎస్సై నరసింహారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం కంభం బస్టాండ్ ఆవరణలో పలువురు ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ గురించి వివరించారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించాలని, ప్రమాదాలు జరిగినపుడు ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా ఉంటుందన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఎన్నికల హామీ మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యం
- రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి, స్వామి



మాట్లాడుతున్న మంత్రులు స్వామి, రవికుమార్‌లు, జర్నలిస్టుల సమస్యలపై మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు

మార్కాపురం, ఆగస్టు 27: జర్నలిస్టుల సంక్షేమానికి తాము, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక కళాశాల రోడ్డులోని మాధవి గ్రాండ్‌ఇన్‌లో మంగళవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు గొట్టిపాటి, స్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులపై ఇష్టారీతిన దాడులు జరిగాయన్నారు. అక్రమ కేసులు కూడా బనాయించి జైళ్లపాలు చేశారన్నారు. మీడియా సంస్థలను, యాజమాన్యాలను వేధింపులకు గురిచేసిందన్నారు. చివరికి అక్రిడిటేషన్ అందజేయడంలో కూడా జగన్ ప్రభుత్వం జర్నలిస్టులపై కక్షపూర్తింగా వ్యవహరించిందని అన్నారు. కలెక్టరేట్‌లలో సమీక్షలు జరిగితే కనీసం జర్నలిస్టులకు ప్రవేశం లేకుండా చేశారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జర్నరలిస్టులను అన్ని విధాల ఆదుకుందన్నారు. అక్రిడేషన్‌లు హెల్త్‌కార్డులు అందజేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, ఇంటిస్థలాలు, గృహనిర్మాణం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆరోగ్య బీమా పథకాన్ని జర్నలిస్టులకు అందజేస్తామన్నారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో మార్కాపురాన్ని జిల్లా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యమన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మాగుంట కుటుంబానికి జర్నలిస్టులకు మధ్య స్నేహ సంబంధమైన వాతావరణం ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తీవ్రంగా పోరాడామన్నారు. తాము గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినా హామీలు ఇచ్చారే కానీ అమలు చేయలేదన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి సమస్యను తీసుకుపోనున్నామన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని, సంక్షేమానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురంలో ఇప్పటికే పాత్రికేయుల ఇళ్లస్థలాల సమస్యలను తాను పరిష్కరించానన్నారు. కొత్తగా వచ్చిన జర్నలిస్టులకు కూడా త్వరలో ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు, గృహనిర్మాణం జరిగేలా తప్పక కృషి చేస్తానని అన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమాజాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల బాధ్యత చాలా గొప్పదన్నారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల కష్టాలు తమకు తెలుసని, ఈ ప్రభుత్వం వారి అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ పాత్రికేయులు వార్తలకు విశ్వానీయత పెంచేలా వార్తలు ప్రచురించాలన్నారు. దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబులు మాట్లాడుతూ నిబద్ధతతో జర్నలిస్టులు పనిచేసి సమాజం బాగుపడే విధంగా కృషి చేయాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అలుగుల సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నూతన జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ కార్యక్రమం అనంతరం మంత్రులతోపాటు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీవీ కృష్ణారెడ్డి, శాసనాల వీరబ్రహ్మం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, సీపీఎం నాయకులు డి.సోమయ్య ఏపీయూడబ్ల్యూజే నాయకులు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

పామూరు, ఆగస్టు 27: పామూరులోని శ్రీమదనవేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రుక్మిణి, సత్యభామ సమేత శ్రీమదనవేణుగోపాలస్వామి విగ్రహాలకు అర్చకులు నారాయణం సత్యబాబు స్వామి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, పసుపులేటి రఘురాం, గుర్నాథం తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి ఫ్రిజ్ బహూకరణ

సీఎస్‌పురం(పామూరు) ఆగస్టు 27: పామూరు పట్టణ రెండో ప్రాదేశిక సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోవిలంపాడు నారాయణస్వామి దేవస్థానంలో మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబుకు కూలింగ్ వాటర్ ఫ్రిజ్‌ను బహూకరించారు. కార్యక్రమంలో నీరుకట్టు నాయబ్ రసూల్, ఇండ్ల నరసింహారావు, కె.రాంమూర్తి, షేక్ అఫ్రిది పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో బాబాకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి ఆగస్టు 27: తర్లుపాడు మండలం తుమ్మలచెరువు గ్రామంలోని శ్రీశ్రీ సయ్యద్ హజరత్ ఖాశీం బాబా దర్గాలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రసిద్ధిగాంచిన హజరత్ బాబాను దర్శించుకుని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలో దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా అన్నిరంగాల్లో ముందంజలో ఉండాలని, కనిగిరి ప్రాంత ప్రజలు పాడి పంటలతో సంతోషంగా ఉండేలా చూడాలని బాబాను వేడుకున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తెలిపారు.

అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు

పీసీపల్లి, ఆగస్టు 27: మండలంలో అటవీ కర్ర నరికివేతపై అధికారుల్లో కదలిక వచ్చింది. అటవీ సంపదపై అక్రమార్కుల కన్ను శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆశాఖ అధికారులు స్పందించారు. పిల్లివారిపల్లి సమీపంలోని అటవీప్రాంతాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించారు.

ఈక్రాప్ పంట నమోదు చేసుకోవాలి

దర్శి, ఆగస్టు 27: రైతులు సాగుచేసిన పంటలను ఈక్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని దర్శి వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ సూచించారు. మండలంలోని పోతవరం, భీమవరం గ్రామాల్లో సాగుచేసిన పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు ఈక్రాప్ నమోదు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్నప్పుడు ఇన్సూరెన్స్ అందుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్పీ దామోదర్‌ను కలిసిన తెలుగుయువత నేత



ఎస్పీ దామోదర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణుబాబు

తాళ్లూరు, ఆగస్టు 27: ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు ఆధ్వర్యంలో మంగళవాంం తాళ్లూరు మండల తెలుగు యువత నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎస్పీని కలిసినవారిలో టీడీపీ బెల్లకొండవారిపాలెం గ్రామ అధ్యక్షుడు పుట్ట నరసింహారావు, టీడీపీ మైనారిటీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు చర్యలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 27: మండలంలోని కోవిలంపాడు గ్రామంలో గత నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈవిషయంపై తెలుగు యువత ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాషా ఏఈ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సిబ్బందితో మరమ్మతు పనులు చేయించారు. దీంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం తొలగిపోయింది.

యువకుడిపై కేసు నమోదు

ముండ్లమూరు, ఆగస్టు 27: మండలంలోని మారెళ్ళకు చెందిన మైనర్ బాలికను గర్భవతిని చేసిన అదే పంచాయతీ పరిధిలోని గంగన్నపాలెం గ్రామానికి చెందిన శ్రీరామ్ జాన్‌హైడ్‌పై పోక్సో కింద మంగళవారం సాయంత్రం కేసు నమోదయినట్లు ఎస్ఐ వై.నాగరాజు తెలిపారు. శ్రీరామ్ జాన్‌హైడ్‌తో పాటు అతని తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు డివిజన్ స్థాయి టీచర్ల సర్దుబాటు

ఒంగోలు(విద్య), ఆగస్టు 27 : డివిజన్ స్థాయి టీచర్ల సర్దుబాటు కౌన్సెలింగ్ బుధవారం జరగనుంది. మండలాల్లో మిగులుగా తేలిన టీచర్లను, భర్తీకాకుండా మిగిలిపోయిన పోస్టులు, సబ్జెక్టులవారీగా ఆయా విద్యా డివిజన్లకు ఉపవిద్యాధికారి లాగిన్లకు పంపారు. ఉపవిద్యాధికారులు లాగిన్లకు వచ్చిన మిగులు టీచర్ల సీనియారిటీ జాబితాలను డౌన్‌లోడ్ చేసుకొని బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చిన మిగులు టీచర్లలో కొందరికి మినహాయింపు ఇచ్చారు. మినహాయింపుల కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు డీఈవో కార్యాలయం నుంచి ఆర్‌జేడీ కార్యాలయానికి పంపుతారు. అక్కడ పరిశీలన అనంతరం పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడ ఆమోద ముద్రపడిన వారిని మిగులు టీచర్ల జాబితా నుంచి తొలగిస్తారు. ఒంగోలు విద్యాడివిజన్ పరిధిలో 22 మంది సబ్జెక్టు టీచర్లు మిగులుగా తేలగా, 150 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మినహాయింపులు పోను ఎంతమంది టీచర్లు మిగులుతారో, ఎన్ని పోస్టులు భర్తీ అవుతాయో బుధవారం తేలనుంది

పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 27: కేంద్రం కొత్తగా తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం, రాష్ట్రం తెచ్చిన గ్యారంటీడ్ పెన్షన్ స్కీంలను తాము ఆమోదించేది లేదని, పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని ఐపీయా కౌన్సిలర్ పీవీ సుబ్బారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గౌరవాధ్యక్షుడు బి.వెంకట్రావు, బి.అశోక్‌కుమార్, ఎ.అమ్మయ్య మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించి మోసగించేందుకే కొత్త పెన్షన్ స్కీంలు తెస్తున్నాయని విమర్శించారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించకపోతే దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు.

ప్రారంభానికి నోచుకోని వసతి గృహం

» పనులు పూర్తయినా పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

» ఇబ్బందులు పడుతున్న బాలికలు



నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహం



నిర్మాణ పనులు చేపట్టేందుకు నాటి మంత్రి శిద్దా వేసిన శిలాఫలకం

తాళ్లూరు, ఆగస్టు 27: నాడు-నేడు కార్యక్రమం కింద రాష్ట్రంలోని విద్యాలయాల రూపురేఖలు మారుస్తున్నట్టు గత వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. ఆచరణలో పట్టించుకున్న పాపానపోలేదు. తాళ్లూరులో ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా నిర్మించిన బాలికల వసతి గృహం ప్రారంభించకుండా నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వసతి గృహం నిర్మాణానికి రూ.కోటి 95 లక్షలు మంజూరయ్యాయి. వైసీపీ పాలనలో నిర్మాణ పనులు పూర్తయినా మూడేళ్లుగా వినియోగంలోకి రాలేదు.

గత టీడీపీ ప్రభుత్వం పేదవర్గాల బాలికల విద్యాభ్యాసం కోసం అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు ప్రత్యేక చొరవతో 2018లో 150 మంది బాలికలు ఉండేందుకు తాళ్లూరులో వసతి గృహ నిర్మాణానికి రూ.కోటి 95 లక్షలు మంజూరు చేయించారు. 2019 మార్చిలో పనులు చేపట్టేందుకు శిద్దా శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వైసీపీ ప్రభుత్వంలో నిధులు రాక ఇబ్బందులు పడినా నిర్మాణ పనులను 2021లో పూర్తిచేసి విద్యాశాఖకు అప్పగించారు. మూడేళ్ల క్రితం పనులు పూర్తయినా బాలికల వసతి గృహాన్ని ప్రారంభించటంలో పాలకులు మీనమేషాలు లెక్కించారన్న విమర్శలు వినవస్తున్నాయి. అన్ని సౌకర్యాలతో బాలికల సంక్షేమం కోసం నిర్మించిన వసతిగృహం అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంది.

అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరుచేసిన నిధులతో బాలికల వసతి గృహం పూర్తయినా గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్ల పేద బాలికలు విద్యకు దూరమయ్యారన్న విమర్శలు వినవస్తున్నాయి. తాళ్లూరులో అన్ని హంగులతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని ప్రారంభించకపోవటంతో కొందరు బాలికలు విద్యాభ్యాసం చేసేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లక ఇంటి పట్టునే ఉండిపోతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం బాలికల వసతి గృహాన్ని వినియోగంలోకి తీసుకువస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మిలు పేద బాలికల పట్ల శ్రద్ధచూపి నిరుపయోగంగా ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని వినియోగంలోకి తీసుకవచ్చి విద్యాభివృద్ధికి పాటుపడాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హెల్మెట్‌ధారణతో ప్రాణరక్షణ

» డీఎస్పీ లక్ష్మీనారాయణ



దర్శిలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి, ఆగస్టు 27: ద్విచక్ర వాహన చోదకులు ప్రాణరక్షణకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సూచించారు. దర్శి పట్టణంలో మంగళవారం సాయంత్రం హెల్మెట్ ధరించటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ఊహించిన ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో హెల్మెట్ ధరించిన వ్యక్తులు సురక్షితంగా ప్రాణాలు కాపాడుకోవటం జరిగిందన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు గురైనప్పుడు అధికశాతం మంది మృతి చెందిన విషయాలను గుర్తుచేశారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ఈసందర్భంగా లయన్స్ క్లబ్ అందజేసిన హెల్మెట్లను వాహన చోదకులకు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో సీఐ వై.రామారావు, ఎస్సై ఎం.మురళీ, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ మానం రామాంజనేయులు, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, సభ్యులు కల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, అప్పికట్ల ఆదినారాయణచారి, నారపుశెట్టి మధు, బి.సత్యనారాయణ, బొగ్గవరపు సుబ్బారావు, బి.ఆంజనేయులు, మునగా శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాహనదారులకు రక్షణ

కనిగిరి ఆగస్టు 27: హెల్మెట్ వాహనదారుల ప్రాణానికి ఎంతో భద్రత కల్పిస్తుందని సీఐ ఖాజావలి అన్నారు. మంగళవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక చర్చి సెంటరులో ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వాహనదారుడికే కాదని, వారి కుటుంబానికి కూడా భద్రత అని అన్నారు అతి వేగంతో బైక్‌రైడింగ్ చేసి ఎంతోమంది యువకులు ప్రాణాల్ని కోల్పోయిన కుటుంబాలు ఉన్నాయన్నారు. ఆ కుటుంబసభ్యులు జీవితాంతం వారిని మననం చేసుకుంటూ నరకయాతన పడే పరిస్థితి రానివ్వవద్దని పేర్కొన్నారు.

కనిగిరి పట్టణంలో తమ సిబ్బందితో కలసి సీఐ హెల్మెట్ ధరించి బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ త్యాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ రక్షణ కవచం

దొనకొండ, ఆగస్టు 27: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఎస్ఐ, సిబ్బంది హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించకపోవటంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. హెల్మెట్ రక్షణ కవచంలా ఉపయోగపడుతుందన్నారు.

హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయండి

తాళ్లూరు, ఆగస్టు 27: ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్సై జి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాలు రక్షింపబడతాయన్నారు. ముందుగా సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు ధరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



కనిగిరిలో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 27: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పామూరులో సీఐ ఎం.భీమానాయక్, సీఎస్‌పురంలో ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. హెల్మెట్ వాడకంపై సీఎస్‌పురంలో మంగళవారం సాయంత్రం వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది హెల్మెట్ లేని కారణంగా తలకు గాయాలు తగిలి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

హెల్మెట్‌లు ధరించాలి

ముండ్లమూరు, ఆగస్టు 27: హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. ముండ్లమూరు నుంచి పసుపుగల్లు వరకు మంగళవారం హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రమాదం జరుగకుండా ఉండేందుకు, హెల్మెట్ ధరించడమే ఏకైక మార్గమన్నారు. కార్యక్రమంలో రైటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది మరియబాబు, పున్నారావు, ప్రేమానిధి తదితరులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గోకులం గ్రామస్థులు

వెలిగండ్ల, ఆగస్టు 27: గత వైసీపీ ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ భూములు ఆక్ర మణలకు గురయ్యాయి. మండలంలోని మొగళ్ళూరు రెవెన్యూ పరిధిలో వైసీపీ నాయకులు అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించారు. చెట్లను నరికి సొమ్ము చేసుకున్నారు. ఈమేరకు మంగళవారం గోకులం గ్రామస్థులు తహసీల్దార్ సువర్ణకు ఫిర్యాదు చేశారు. 334-1, 334-2, 335-1, 335-2, 336 గల సర్వే నెంబర్‌ల్లో 54 ఎకరాల అగ్రిగోల్డ్ భూములను అక్రమించి సాగు చేసుకుంటున్నారని రైతులు సందడి మస్తాన్ రెడ్డి, శ్రీనివాసులు, రమణయ్య, ఆదినారయణ, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, తిరపతయ్య ఫిర్యాదు చేశారు.

భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని అగ్రిగోల్డ్ భూములకు రక్షణ కల్పించాలని తహసీల్దార్‌ను కోరారు

దొనకొండ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసిన మండల నేతలు



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును కలిసి అభినందిస్తున్న దొనకొండ మండల నాయకులు

దొనకొండ, ఆగస్టు 27: దొనకొండ ప్రాంత అభివృద్ధిపై సీఎం చంద్రబాబుతో చర్చించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని టీడీపీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి నేతృత్వంలో పలువురు నాయకులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. టీడీపీ ప్రభుత్వంలో దొనకొండలో పరిశ్రమల ఏర్పాటుచేస్తామని చంద్రబాబు ప్రకటించారని వారు పేర్కొన్నారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వంలో ఈప్రాంత అభివృద్ధిని గాలికొదిలేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈప్రాంత అభివృద్ధిపై ప్రజలు ఎంతో నమ్మకంగా ఉన్నారని అన్నారు. దొనకొండలో పరిశ్రమల ఏర్పాటు, బ్రిటీష్‌కాలం నాటి విమానాశ్రయం అభివృద్ధి జరుగుతుందని ఆశాభావంతో ఉన్నారని చెప్పారు. దొనకొండ ప్రాంతంతో పరిశ్రమల ఏర్పాటు జరిగితే పేద ప్రజలకు ఉపాధి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పర్యవేక్షణలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగేలా చర్యలు చేపట్టాలని శ్రీనివాస రావును కోరారు. దీనిపై స్పందించిన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి చర్యలు చేపడతామని చెప్పారు.

పల్లా శ్రీనివాసరావును కలిసినవారిలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, మాజీ ఎంపీపీ నూనె విజయకుమారి, కామేపల్లి చెంచయ్య, వల్లపునేని వెంకటస్వామి, తాండ్ర వెంకటేశ్వర్లు, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వల్లపునేని ఆదినారాయణ, సింగమనేని హనుమంతు, పత్తి సుబ్బయ్య, బోయపాటి సుబ్బయ్య, నూనె డేవిడ్‌సన్, తదితరులు ఉన్నారు.



బైపాస్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులు

అసంపూర్తి బైపాస్ పనుల పరిశీలన

కనిగిరి ఆగస్టు 27: అసంపూర్తిగా మిగిలిపోయిన హైవే 565 నిర్మాణ పనులకు సంబంధించి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం అధికారులతో కలసి పరిశీలించారు. గత నెలలో అప్పటి కలెక్టర్ రూ.13 కోట్లను బైపాస్ రోడ్డు వెళ్ళే 19 ఎకరాలకు విడుదల చేశారు. ఆ నిధులను వారంలోపు బైపాస్‌తో భూములు కోల్పోయేవారికి ఎకరాకు దాదాపు రూ.74లక్షల వరకు అందజేయనున్నట్లు సమాచారం. అయితే, పొదిలి రోడ్డులోని పెద్దచెరువు అలుగువాగు వద్ద పైగుండా రోడ్డు పామూరు రోడ్డులోని కొత్తూరు వద్ద అభయాంజనేయస్వామి దేవాలయం వరకు బైపాస్ రోడ్డు వేయాల్సి ఉంది. బైపాస్ బాధితులకు వారి ఖాతాల్లో నష్టపరిహారం విడుదలయ్యేలోపు జంగిల్ క్లియరెన్స్‌తో పాటు అప్పట్లో వేసిన హద్దురాళ్ళు పరిశీలించి మార్కింగ్ వేయించారు. కార్యక్రమంలో సర్వేయర్ వైష్ణవి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'మోపాడు' ప్రధాన కాలువ తూము గేటు ఏర్పాటు



నూతనంగా తయారు చేయించిన రిజర్వాయర్ తూము గేటు



మోపాడు రిజర్వాయర్ తూము గేటును బిగిస్తున్న దృశ్యం

పామూరు, ఆగస్టు 27: మండలంలోని మోపాడు రిజర్వాయర్ ప్రధాన కాలువ తూము గేటును ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేశారు. జైకో నిధులతో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో భాగంగా మోపాడు రిజర్వాయర్ తూము గేటు పనులు ప్రారంభించారు. బ్రిటీష్ హయాంలో నిర్మించిన మోపాడు రిజర్వాయర్ గేటు తూము 120 సంవత్సరాల అనంతరం మరమ్మతులకు గురయింది. దీంతో రిజర్వాయర్‌లోని నీరు లీకేజీ అవుతూ నీరు వృధాగా బయటకు పోతున్నది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో నూతన గేటు నిర్మాణ ప నులు విజయవాడలో పూర్తి చేయించారు. ఈ గేటును విజయవాడ నుంచి ప్రత్యేక వాహనంలో మోపాడుకు తెప్పించి యంత్రం సహాయంతో బిగింపు చర్యలు చేపట్టినట్లు ఇరిగేషన్‌శాఖ సిబ్బంది తెలిపారు. ఎన్నో ఏళ్లనుంచి తూముకు నూతనంగా గేటు నిర్మించాలన్న ఈప్రాంత ప్రజల చిరకాల కోరికను ఉగ్ర ఆదేశాలతో కార్యరూపం దాల్చడంతో ఆయకట్టుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జైకో నిధులతో ఇప్పటికే ప్రధాన కాలువలపై నాలుగుచోట్ల బ్రిడ్జి నిర్మాణం, కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. రిజర్వాయర్ వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలో రిజర్వాయర్ లోపలి భాగంలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 28 ఆగస్టు 2024





సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో కిక్కిరిసిన జ్వర పీడితులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముత్యాలంపాడు వాసి పద్మావతి



దాచేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు వచ్చిన జ్వరపీడితులు



తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

పల్లెకు.. జ్వరం

మంచం పట్టిన గ్రామీణులు

- అంతుపట్టని జ్వరాలతో ఆందోళన
- పట్టణాల్లోనూ ప్రతి ఇంటా పీడితులే
- కిటకిటలాడుతున్న ప్రైవేటు ఆస్పత్రులు
- నొప్పులు, వాపుతో అల్లాడుతున్న ప్రజలు
- జ్వరం తగ్గిన తర్వాతా పీడిస్తోన్న నీరసం
- మలేరియా, డెంగీ జ్వరాలు ఎక్కువగా నమోదు

జ్వరం.. జడిపిస్తోంది. అంతుబట్టని జ్వరాలతో జనం ఆందోళన చెందు తున్నారు. సీజన్‌లో వచ్చే సాధారణ జ్వరాలకు భిన్నంగా ప్రస్తుతం పరిస్థితి ఉండటంతో పీడితుల్లో భయం నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లా జ్వరంతో పడకేసింది. పల్లెలు.. పట్టణాలు అన్న తేడా లేకుండా ప్రతీ ఇంటా జ్వర పీడితులు ఉన్నారు. ఇక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. మందుల దుకాణాల్లోనూ జ్వరాలకు సంబంధించి మందుల కొనుగోళ్లు గత కొంతకాలంగా అధికమయ్యాయి. జ్వరమని ఆస్పత్రికి వెళ్తే టెస్టుల పేరుతో బాధితులు బలవుతున్నారు. ఇక పల్లెలు జ్వరాలతో మంచం పడుతున్నా.. వైద్య ఆరోగ్య శాఖ తూతూమంత్రంగా శిబిరాలతో సరిపెడుతోందన్న విమర్శలు న్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో జ్వరాలతో మరణాలు కూడా సంభవించాయి. అననుకూల వాతావరణ పరిస్థితులు, అడుగంటిన పారిశుద్ధ్యం, తాగునీరు, దోమలు తదితరాలు ప్రజలను జ్వరాలు పీడిస్తున్నాయి. పల్నాడు జిల్లాలోని అచ్చంపేట, దాచేపల్లి, బెల్లంకొండ, మాచవరం వంటి ఏటిపట్టు మండలాల్లో జ్వరాల వ్యాప్తి ఎక్కువ గా ఉంది. గుంటూరు నగర పరిధి లోని మురికివాడల్లో కూడా జ్వరాల వ్యాప్తి ఎక్కువ గా కనిపిస్తుంది. బాపట్ల జిల్లాలో చాలా గ్రామాలు జ్వరాలతో మంచం పట్టాయి.

మలేరియా, డెంగీ కేసులూ ఎక్కువే..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ సీజన్‌లో మలేరియా, డెంగీ జ్వరాలు కూడా ఎక్కువగానే నమోదు అవుతున్నాయి. ఒక్కసారిగా తెల్ల రక్త కణాలు పడిపోతుండటంతో బాధితులు తీవ్ర అస్వస్థతకు లోనౌతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్ఎంపీల వద్ద మలేరియా, డెంగీ కేసులకు చికిత్స కోసం బాధితులు బారులు తీరుతున్నారు. డెంగీ బాధితులకు చికిత్స చేసే ఆర్ఎంపీలు వారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా చేజారిన తర్వాత పెద్ద ఆస్పత్రికి తరలిస్తున్నారు. దీంతో వారి పరిస్థితి విషమిస్తోంది.



రకరకాల టెస్టులతో గుల్ల..

జ్వరం వచ్చిందంటే చాలు ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు రకరకాల టెస్టుల పేరుతో రోగుల జేబులకు చిల్లు పెడుతు న్నారు. మొదట ఒకటి, రెండు రోజులు స్థానిక మెడికల్ షాపుల్లో మందులు వేసుకున్నప్పటికీ జ్వరం అదుపు లోకి రాకపోవడంతో అప్పుడు ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లాక ఆ టెస్టులు.. ఈ టెస్టులు అంటూ పలు రకాల టెస్టులతో సుమారు పది వేల రూపాయల వరకు టెస్టులకే ఖర్చు చేయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే అక్కడ సరైన చికిత్స అందదని రోగులు ప్రైవేటు వైద్యశాలలకు క్యూ కడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ అని నిర్ధారణ అయిన కొందరిలో ప్లేట్‌లెట్స్ పడిపోయాయని, రోగి పరిస్థితి విషమిస్తోందన్న వైద్యుల మాటలతో రోగి తరపు బంధువులు ఖర్చుకు వెనకాడటం లేదు. ఇదే అవకాశంగా వారు దోచుకుంటున్నారు.





తెనాలి జిల్లా వైద్యశాల్లో రక్తపరీక్షలకు క్యూలో ఉన్న రోగులు

గుంటూరు సిటీ, గుంటూరు(మెడికల్), పిడుగురాళ్ల, దాచేపల్లి, ఆగస్టు 27: ఉమ్మడి గుంటూరు జిల్లా జ్వరంతో అల్లాడిపోతోంది. గతంలో ఎన్నడూ లేనట్లుగా ప్రస్తుతం వస్తున్న జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొదట పల్నాడులో మొదలైన జ్వరాలు ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వ్యాపించి పట్టి పీడిస్తున్నాయి. సాధారణ జ్వరంగా ఆరంభమై తీవ్రమైన ఒళ్లు నొప్పులు, దగ్గు, వాపు వంటి లక్షణాలతో జనం ఆందోళన చెందుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా తీవ్ర జ్వరం, దగ్గు తలనొప్పి, గొంతునొప్పి తదితర లక్షణాలతో బాధ పడుతు న్నారు. కొందరిలో రోజుల తరబడి 102 డిగ్రీల పైన జ్వరంతోపాటు తలనొప్పి ఒళ్లునొప్పులు కనిపిస్తున్నాయి. విపరీతమైన ఎండ, వేడిమి, ఉక్కపోత.. అంతలోనే వర్షాలతో అంతుపట్టని రీతిలో జ్వరాలు వ్యాపిస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలం మొదలైన తర్వాత సీజనల్‌గా జ్వరాలు వస్తూ ఉంటాయి. అయితే కొత్తగా వస్తోన్న జ్వరాలు ప్రజలను మానసికంగా, శారీరకంగా కోలుకోలేని దెబ్బ కొడుతున్నాయి. ఇవి వైరల్ ఫీవర్లు కావడంతో ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడితే.. ఇంటిల్లిపాదీ వీటికి గురౌతున్నారు. బాధితుల్లో జ్వరం, కీళ్ల నొప్పులు, పాదాలు, చేతుల వాపు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. జ్వరం తగ్గుతున్నా, కొంత కాలం వరకు కీళ్ల నొప్పులు పలువురిని వదలటం లేదు. మెజార్టీ రోగుల్లో 4-6 వారాల పాటు కీళ్ల నొప్పులు వేధిస్తున్నట్లు చెబుతున్నారు. క్వారీలు ఎక్కువగా ఉండే పల్నాడు జిల్లా పరిధిలోని రెంటచింతల, పిడుగురాళ్ల వంటి చోట్ల మలేరియా కూడా వ్యాప్తి చెందుతుంది. ఇవన్నీ ముందే ఊహించనవి. కానీ ఈ ఏడాది జ్వరాల సీజన్ పూర్తి భిన్నంగా ఉంది. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, మాచవరం మండలాల పరిధిలో ఎక్కువ భాగం టైఫాయిడ్, డెంగీ కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఎక్కడికక్కడ స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలు తాత్కాలిక వైద్యం అందించినా జ్వరం, ఒంటినొప్పులు తగ్గకపోవడంతో వారే ప్రైవేటు వైద్యశాలలకు సిఫార్సు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో విస్తృతంగా గన్యా జ్వరాలు కనిపిస్తున్నాయి. ఆయా జిల్లాల్లో ఏ పల్లె చూసినా ఇదే పరిస్థితి. మంగళగిరి నియోజకవర్గం తుమ్మపూడిలో 300 మంది జ్వరాల బారిన పడి మంచం పట్టారు. రెండు నెలలుగా ఇక్కడ జ్వరాలు విజృంభిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలోని అచ్చంపేటలో వందల మంది జ్వరపీడితులు ఉన్నారు.

అంతు పట్టని రోగం

ఈ సీజన్‌లో వచ్చిన జ్వరాలు వైద్య, ఆరోగ్య శాఖకు కూడా అంతు పట్టకుండా ఉన్నాయి. తీవ్ర జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు వస్తుండటం చూసి తొలుత చికెన్ గున్యా అనుకున్నారు. కానీ జ్వరం, నొప్పులు, వాపు రావడం చూసి వారికి పరీక్షలు నిర్వహించగా చాలామందిలో చికెన్ గున్యా కాదని తేలింది. అదే నమూనాలను పూణే ల్యాబ్‌కు పంపగా అవి చికెన్ గున్యా జ్వరాలని తేలింది. చికెన్ గున్యా వైరస్ మార్పు చెందిననట్లు వైద్య, ఆరోగ్య శాఖ తేల్చింది. జ్వరం ఇంట్లో ఒకరికి వస్తే వెంటనే మరొకరికి సోకుతుండటంతో అదుపు చే యడం కష్టంగా మారింది. ప్రస్తుతం జ్వరా లు బారిన పడిన చాలా మందికి వంటి మీద దద్దుర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. చిన్న గుల్లలు లాగా కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. జ్వరాలు తగ్గిన తర్వాత కూడా దద్దుర్లు తగ్గడం లేదు.

దీర్ఘకాలిక రోగుల పరిస్థితి దారుణం

జ్వరం వస్తే షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు, వృద్ధులు కోలుకోవడం కష్టంగా ఉంది. జ్వరం వస్తే వారు పూర్తిగా బలహీన పడుతున్నారు. పది, పదిహేను రోజులకు కూడా నీరసం తగ్గడం లేదని అంటున్నారు. గతంలో వచ్చిన జ్వరాలు వల్ల ఏనాడు ఇంత నరక యాతన పడలేదని బాధితులు తెలిపారు. తీవ్రమైన జ్వరం, నొప్పులు తట్టుకునేందుకని వాడుతున్న పెయిన్ కిల్లర్స్, యాంటీ బయోటిక్స్ కూడా వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. పూర్తిగా అవగాహన లేని వ్యక్తులు ఇష్టానుసారంగా మందులు వాడటం వల్ల తర్వాత కాలంలో తీవ్రంగా నష్టపోతారని హెచ్చరిస్తున్నారు.

30న నరసరావుపేటకు చంద్రబాబు, పవన్

- జేఎన్‌టీయూ కళాశాలలో వన మహోత్సవానికి హాజరు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. సీఎంగా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్‌లు బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా సంయుక్తంగా ప్రజలు ముందుకు రానున్నారు. ఇందుకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట వేదిక కానున్నది. మండలంలోని కాకాని వద్ద జేఎన్‌టీయూ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 30వ తేదీ వనమహోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసికట్టుగా పాల్గొననున్నారు. సీఎం, ఉపముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ పర్యటనకు అధికారులు విస్తృత ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. హెలిప్యాడ్, సభా స్థలి ఏర్పాట్లపై అధికారులతో వారు సమీక్షించారు. కార్యక్ర మంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, అటవీశాఖ అధికారి రామ చంద్రరావు,ఆర్డీవో సరోజ, తహసీల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు.. అగ్ని పరీక్ష

- విద్యాశాఖ అధికారుల హడావిడితో బెంబేలు
- నేటి నుంచి విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్ష
- ఎమ్మార్సీల నుంచి గంట ముందు పశ్నపత్రాల జారీపై గందరగోళం
- గత ఏడాది ఓఎంఆర్ పరీక్షల ఫలితాలను విడుదల చేయని అధికారులు

గుంటూరు (విద్య), ఆగస్టు 27: ప్రతి రోజు పరీక్షకు గంట ముందు ప్రశ్నపత్రాలు జారీ.. ఈ ప్రశ్నాపత్రాలు, ఓఎం ఆర్ షీట్ల కోసం వారివారి పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు ఎమ్మార్సీ ఎంఈవో కార్యాలయాలకు రావాలి.. అక్కడ ప్రత్యేక కమిటీ ఆధ్వ ర్యంలో సీఆర్పీలు ప్రశ్నపత్రాలు జారీ చేస్తారు.. ఈ ప్రశ్నపత్రాలు లీక్ చేస్తే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయి.. ఇదేదో ఎస్ఎస్‌ఈ, ఇంటర్ బోర్డు పరీక్షలకు సంబంధించి అనుకుంటే తప్పులో కాలేసినట్లే. బుధవారం నుంచి 1వ నుంచి 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే సెల్ఫ్ ఎసెస్‌మెంట్ పరీక్షకు సంబంధించి విద్యా శాఖ చేస్తున్న హడావిడి. దీంతో ఉపాధ్యాయులు బెంబేలెత్తి పోతున్నారు. ఉమ్మడి గుంటూ రు జిల్లాలో 425పైగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, మరో 335 వరకు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు బుధవారం నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరీక్ష కోసం ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్లు రూపొందించారు. పోటీ పరీక్షల తరహాలో నిర్వహించే ఈ పరీక్షలకు ప్రశ్నపత్రాలు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు రూపొందించి మండల స్థాయిలోని విద్యా వనరుల కేంద్రానికి పంపింది. అక్కడ నుంచి పాఠశాలల వారీగా ప్రశ్నపత్రాలు జారీ చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండల విద్యావనరుల కేంద్రానికి వెళ్లి ప్రశ్నపత్రాలు తీసుకువెళ్లాలి. తొలుత పాఠశాలకు వచ్చి ఇక్కడ ఫెషియల్ హాజరు వేసిన తర్వాతే ఆయా కార్యాలయాలకు వెళ్లి ప్రశ్నపత్రాలను సేక రించాలి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 10 నుంచి 20 శా తం పాఠశాలలు మాత్రమే విద్యావనరుల కేంద్రాలకు సమీపంలో ఉన్నాయి. మిగిలిన పాఠశాలల నుంచి రావాలంటే ఉపాధ్యాయులు సటున 20 నుంచి 45 కిలోమీటర్లు ప్రయాణించాలి. బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కొన్ని గ్రామాలు అయితే 60 కిలోమీటర్లు ప్రయాణిస్తే కానీ మండల కేంద్రాలు రావు. ఈ పరిస్థితుల్లో ఆయా పాఠశాలల నుంచి ప్రశ్నపత్రాల కోసం వెళ్లడం ఎలా సాధ్యమని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరీక్షలపై విద్యాశాఖ హడావుడితో ఉపాధ్యాయులకు అగ్ని పరీక్షగా మారిందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అనేకచోట్ల స్కూల్స్ ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. అక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు ప్రశ్నపత్రాల కోసం వెళ్తే విద్యార్థుల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల పెదకాకాని సమీపంలో ఉపాధ్యాయుల ప్రమేయం లేకున్నా అక్కడ చదివే విద్యార్థులు గాయపడ్డారని క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రశ్నపత్రాలను ఒక రోజు ముందే సీలు వేసి సీఆర్పీలు, విద్యా అసిస్టెంట్లు, కాంట్రాక్టు ఉపాధ్యాయుల ద్వారా పంపిణీ చేయాలని, పాఠశాల స్థాయిలో ఉన్న కమిటీ ద్వారా పరీక్షలు పక్కాగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఓఎంఆర్ షీట్ల పరీక్షలో కుంభకోణం

విద్యార్థులకు ఓఎంఆర్ షీట్ల ద్వారా పరీక్ష నిర్వహించడంలో పెద్ద కుంభకోణం దాగి ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారి కమీషన్ల కోసం ఓ ఏజన్సీకి ఓఎంఆర్‌షీట్ల బాధ్యతలు కట్టబెట్టారని, ఇందులో అక్రమాలు జరిగాయని సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది జరిగిన ఓఎంఆర్ షీట్ల పరీక్షపత్రాలను ఇప్పటి వరకు మూల్యాంకనం చేయలేదు. ఈ మాత్రం దానికి పరీక్ష పెట్టడం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు.

ఉపాధి సొమ్ములు ఊడ్చేశారు

- బోర్డులు ఏర్పాటు చేయకుండానే నిధులు డ్రా
- ఒక్కో మండలంలో రూ.10 లక్షలపైనే బొక్కేశారు



అద్దంకి, ఆగస్టు 27: గుడ్ గవర్నెన్స్ ఇంటియేటివ్స్(జీజీఐ) నిధులు ఉపాధి సిబ్బందికి కాసులు పంట కురిపించింది. 2019 నుంచి 2024 వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో వివరాలను తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలి. దీని కోసం ఒక్కో బోర్డుకు 750 నుంచి 1500 రూపాయలు ఖర్చు చేయాలి. ఒక్కో మండలంలో సరాసరిన చేసిన వెయ్యి పనులకు బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ బోర్డుల ఏర్పాటు పేరుతో ఒక్కో మండలంలో రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు జీజీఐ అకౌంట్ నుంచి డ్రా చేశారు. అయితే పనులు చేసిన చోట ఎక్కడా బోర్డులు ఏర్పాటు చేయలేదు. అద్దంకిలో ఇటీవల వరకు గుట్టలుగుట్టలుగా రాళ్ల పడేసి ఉంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హడావుడిగా రాళ్లను ఆయా గ్రామాలకు తరలించినా ఇంకా ఏర్పాటు చేయలేదు. అత్యధిక మండలాలలో అసలు బోర్డులనే తయారు చేయించలేదు. ఆడిట్‌లో మాత్రం అంతా ఖర్చు చేసినట్లు చూపించారు. ఉన్నతాధికారులు లోతైన విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది.



బల్లికురవలో పడవేసి ఉన్న బోర్డులు రాసే రాళ్లు

చీర్స్.. చీర్స్

- విచ్చలవిడిగా అనధికార బార్లు
- ముడుపులతో పట్టించుకోని అధికారులు



ఇంకొల్లులో అనధికారిక రెస్టారెంట్‌లో మద్యం తాగుతున్న దృశ్యం

చీరాల, ఆగస్టు 27: గ్లాసుల గలగలలు.. చీర్సం దడి.. మద్యపానానికి సకల సౌకర్యాలు.. ఇవన్నీ ఏదో అనుమతి పొందిన బార్లకే పరిమితం కాదు. అధికారులు, రాజకీయ నాయకుల అండ దండ ఉంటే ఎవరైనా.. ఎక్కడైనా అనధికారికంగా ఏర్పాటు చేసుకోవచ్చని చీరాల, పర్చూరు ప్రాంతాల్లో వెలిసిన బార్ అండ్ రెస్టారెంట్లను చూస్తే అర్థమవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగేందుకు అడ్డాగా అనధికార బార్ అండ్ రెస్టారెంట్లు వెలిశాయి. అధికారులకు ఇవ్వాల్సింది ఇస్తున్నాం. ఇక మమ్మల్ని అడిగేదెవరు.. ఆపేదెవరు అంటూ సంబంధిత నిర్వాహకులు బహిరంగంగా వ్యాఖ్యానించడం విశేషం. ఇంకొల్లు, నూతలపాడు, పూసపాడు అడ్డరోడ్డు, పర్చూరు, మార్టూరు, కారంచేడు ప్రాం తాల్లో అనధికారిక రెస్టారెంట్లు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మారినా అనధికారిక బార్ల విషయంలో అధికారులు కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలవారీ మామూళ్లే ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి.

మా దృష్టికి రాలేదు

అనధికారిక రెస్టారెంట్ అండ్ బార్లు నిర్వహిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. అనధికారికంగా హైవే పక్కన ఏ హోటల్ లేదా రెస్టారెంట్‌లో మద్యం తాగేందుకు అనుమతి లేదు. అనుమతులు లేకుండా మద్యం తాగేందుకు ఎవరైనా ప్రోత్సహిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

- భుజంగరావు, కర్ణ, ఎక్సైజ్ సీఐలు, పర్చూరు, చీరాల

సింథైట్ ఫ్యాక్టరీలో ఆకస్మిక తనిఖీ

కమిటీ అనుమతి లేకుండా ఎలా నడుపుతారని నిలదీత



ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న అధికారులు

మేదరమెట్ల, ఆగస్టు 27 : మేదరమెట్లలోని సింథైట్ ఫ్యాక్టరీలో పొల్యూషన్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో మిరపకాయలు పొడి చేసే యూనిట్ నడపం పట్ల ఈఈ రాఘవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ నియమించిన కమిటీ ఆదేశాలు లేకుండా ఎలా నడుపుతారని ఆయన ప్రశ్నించారు. ట్రైయిల్ రన్ మాత్రమే చేస్తున్నామంటూ ఫ్యాక్టరీ అధికారులు అధికారులకు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మిరపకాయలు పొడి చేసే బాయిలర్ యూనిట్‌ను పరిశీలించారు. అక్కడ కొత్తగా చేస్తున్న నిర్మాణాలను గురించి అధికారులు వివరించారు. మిరపకాయలు పొడి చేసే యూనిట్ నుంచి బయటకు వచ్చే గాలిని గతంలో గాలిలోకి వదిలేసేవారు. ఇటీవల కమిటీ సందర్శించిన తరువాత అక్కడ చేస్తున్న కొత్త నిర్మాణాలను అధికారులకు వివరించారు. గాలిలోకి కలువకుండా ఆ యూనిట్ నుంచి వచ్చే వ్యర్థాలను అక్కడ ఏర్పాటు చేసిన నీటి ట్యాంక్‌లలోకి పెట్టిన విధానాన్ని చూపించారు. కమిటీ అనుమతి లేకుండా మిరపకాయలను పొడిచేసే విభాగాలను నడపడానికి వీలు లేదని రాఘవరెడ్డి ఆదేశించారు. అక్కడ పెద్ద మొత్తంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న మిరపకాయల పొడి ఉండడం ఫ్యాక్టరీ నడుస్తున్నదానికి నిదర్శనం. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరావుతో పాటు ఆర్ఐ పోతురాజు, వీఆర్‌వో రాజశేఖర్‌రెడ్డి, సింథైట్ అధికారులు పాల్గొన్నారు.

కావాల్సింది ప్రక్షాళనే!

నగరంలో చెత్త ఎత్తరు.. చీపురు పట్టరు..

అక్రమ కట్టడాలకు టౌన్'ప్లానింగ్'

రెవెన్యూలో అవినీతి జలగలు.. నీటి సరఫరా అస్తవ్యస్తం..

సిబ్బందిని ఇబ్బంది పెడుతున్న లీకులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 27 : ఒంగోలు నగరపాలక సంస్థలో గత ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలన ఫలితంగా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ప్రతి పనికి మామూళ్లు నడిచాయి. పౌరులకు పారదర్శక సేవలు ఐదేళ్ల నుంచి దూరమయ్యాయి. ఒక్కమాటలో చెప్పుకుంటే ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ వాసన ఇంకా పోలేదనే చెప్పొచ్చు. ముఖ్యంగా పారిశుధ్య విభాగంలో పేరుకు కార్మికులు 650 మంది వరకు ఉన్నా, సగం మంది చీపురు పట్టరు, చెత్త ఎత్తరు. అయితే అటెండర్లుగా, మేస్త్రీలుగా చెలామణి అవుతూ వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నారు. దీంతో నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం పనిచేసేవారు కరువయ్యారు. దీంతో వీధులన్నీ కంపుకొడుతున్నాయి.

రెవెన్యూ అంటేనే అవినీతి

ఇదిలా ఉంచితే రెవెన్యూ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. కొందరు ఆర్ఐలు వైసీపీ పెద్దల అండదండలతో ఆ సీట్లు దక్కించుకున్న విషయం తెలిసిందే. అలాగే ఇష్టారీతిన ఇంటిపన్నులు వేసి వేలల్లో వసూలు చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంచితే, అడిగినంత ఇవ్వకుంటే ప్లాను ఉన్నా అనధికార కట్టడంగా మార్చేసి ఇంటి యజమానికి చుక్కలు చూపించడం ఆనవాయితీగా మారింది. మరికొందరు వైసీపీ పెద్దల ఆశీస్సులతో వారి చెప్పినంత ముట్టజెప్పకుంటే నెలలు గడిచినా పన్ను వేసే పరిస్థితి లేదు. మరోవైపు టౌన్ ప్లానింగ్‌లో ఇష్టారాజ్యమై పోయింది. ప్లాన్ ఇవ్వాలంటే పైసలు చెల్లించాల్సిందే. కార్యాలయంలోని కొందరు సిబ్బంది ఆశీస్సులు ఉంటే ప్లాను లేకపోయినా పక్కాగా భవనాలు నిర్మించుకునే పరిస్థితి ఉంది.

అస్తవ్యస్తంగా నీటిసరఫరా, పౌరసేవలు

ఇకపోతే సచివాలయ వ్యవస్థలో ఒక్కో సచివాలయంలో పదిమంది వరకు సెక్రటరీలు ఉన్నారు. నగరంలో 70కిపైగా సచివాలయాలు ఉండగా 700 మంది వరకు సెక్రటరీలుగా ఉన్నారు. అయితే వీరు మాత్రం పౌరసేవల గురించి పెద్దగా పట్టించుకునే పరిస్థితి లేదు. మరోవైపు ఇంజనీరింగ్ విభాగంలో తాగునీటి సరఫరాపై ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లీకుల మోత, మోటార్ల మరమ్మతులు, ఇంకా పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్ల కొరత ఇలా రోజుకో సమస్యతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. కాగా ప్రభుత్వం మారింది, పాలకులు మారారు కానీ కార్పొరేషన్ సిబ్బంది పనితీరు మారలేదని కార్యాలయ పరిస్థితి చూస్తే అర్థమవుతుంది.

అవినీతికి అడ్డుకట్ట వేయాల్సిందే

ఇప్పటికైనా ప్రతి సెక్షన్‌లోనూ మార్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. నగర ప్రజలు సైతం సమగ్ర ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అవినీతికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. కాగా నగర కమిషనర్‌గా కోడూరి వెంకటేశ్వరరావు నేడు బాధ్యతలు చేపడుతున్న నేపథ్యంలో పారిశుధ్యం విభాగంలో పూర్తిస్థాయిలో కార్మికులను పనికి కేటాయించాల్సిన అవసరం ఉంది. కార్యాలయంలో తిష్టవేసి, పనిచేయకుండా పెత్తనం చేయడానికి, మొక్కుబడి సేవలకు పరిమితమైన వారిని ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు. అలాగే తాగునీటి సరఫరాలో లోపాలను సవరించి, సక్రమంగా నీరు అందించేలా చూడాలని కోరుతున్నారు. మరోవైపు కార్పొరేషన్‌కు ఆదాయ వనరుగా ఉన్న రెవెన్యూ విభాగంలో 'గూడు'పుఠానికి తెర తీసిన అవినీతి ఆర్ఐలను తొలగించి, పారదర్శక సేవలు అందించాల్సిన అవసరం కనిపిస్తోంది. నగరంలో అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నేడు కమిషనర్‌గా వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

ఒంగోలు నగర నూతన కమిషనర్‌గా కోడూరి వెంకటేశ్వరరావు బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. నరసాపురం మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఒంగోలుకు బదిలీ చేసింది.

లోగ్రేడ్.. నోబిడ్...!

నాణ్యత తక్కువ పొగాకు ధరలు పతనం

కిలోకు రూ.50 వరకూ కోత

మేలురకం ధరలపై సీలింగ్

ఉత్పత్తి తగ్గిన రైతులు ఆందోళన

టంగుటూరు, కొండపిలలో వేలాన్ని పరిశీలించిన బోర్డు చైర్మన్, అధికారులు

పొగాకు రైతుల ఆనందం అంతలోనే ఆవిరైంది. మార్కెట్ ప్రారంభం నుంచి ఉన్న ధరలు ప్రస్తుతం దిగజారాయి. కేంద్ర వాణిజ్యశాఖ నుంచి అదనపు పొగాకు విక్రయాలకు అనుమతులు వచ్చిన దగ్గర నుంచి లో, మీడియం గ్రేడ్‌ల ధరలకు భారీగా కోతపడ్డాయి. మేలు రకం పొగాకు కూడా ధర తగ్గింది. లోగ్రేడ్ రకం పొగాకు అయితే ఏకంగా కేజీకి రూ.10పైనే తగ్గింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. అపరాధ రుసుం లేకుండా పోయిందన్న పొగాకు రైతుల సంతోషంపై వ్యాపారులు లోగ్రేడ్ ధరల రూపంలో నీళ్లు చల్లారు. ఈ ప్రభావం వచ్చే సీజన్ సాగుపై కూడా పడింది. పొలాల కౌలు, బ్యారన్ అద్దెలు, కూలీల వేతనాల విషయంలో రైతులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్ల ముగింపు దశలో ధరలు బాగా ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం ఆయా గ్రేడ్లకు లభిస్తున్న ధరలను చూసి వారు ఆందోళన చెందుతున్నారు. ఏ ఒక్క గ్రేడ్‌కూ గతంలో ఉన్న ధరలు లభించడం లేదు. లోగ్రేడ్ ధరలు పతనమవడంతోపాటు నోబిడ్లు భారీగా ఉంటున్నాయి. అధికంగా పండిన ఎఫ్-5 రకంలో గ్రేడ్ ధరలు గత నాలుగైదు రోజులుగా కిలోకు సగటున రూ.50 వరకూ తగ్గిపోయాయి. అలాగే మేలురకం ధరలపైనా వ్యాపారులు సీలింగ్ పెట్టి కొనుగోలు చేస్తున్నారు. అధిక పంట ఉత్పత్తికి అపరాధ రుసుం రద్దుతో కొంత ఊరట కలుగుతుందని భావించిన రైతులు ధరల తగ్గుదలతో దిగాలు పడుతున్నారు. అధిక ఉత్పత్తిపై అపరాధ రుసుం తగ్గింపు ఉత్తర్వుల అనంతరం ధరలు పడిపోయాయి. అంతకు ముందు గ్రేడ్ ఏదైనా రేటు ఒకటే అన్న విధంగా మార్కెట్ సాగింది. మేలు, మీడియం రకం ధరలు కిలో రూ.360 నుంచి రూ.380 వరకు కూడా పలికాయి. అధికశాతం ఆ గ్రేడ్ల ధరలు కిలో రూ.350పైనే ఉండగా లోగ్రేడ్‌ను సైతం కిలో రూ.270 వరకూ చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు.

భారీగా తిరస్కరణలు

ప్రస్తుతం మార్కెట్‌లో నాటి ధరలు దక్కకపోవడమే కాక పలు వేలంకేంద్రాలలో లోగ్రేడ్ బేళ్ల భారీగా తిరస్కరణ (నోబిడ్)లు జరుగుతున్నాయి. నెలక్రితం వరకూ మార్కెట్‌లో ధరలు బాగా లభించడంతోపాటు నోబిడ్ బేళ్లు రెండు, మూడు శాతం కూడా ఉండేవికావు. అలాంటిది వారం నుంచి మార్కెట్‌లో ధరలు తగ్గడంతోపాటు నోబిడ్‌లు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటివరకూ దక్షిణాది వేలం కేంద్రాల్లో సుమారు 119 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.263 ధర లభించింది. సగటు ధర గతంలో పోల్చితే అధికంగానే ఉన్నప్పటికీ నెలక్రితం వరకూ మార్కెట్లో ఉన్న ధరలు ప్రస్తుతం కనిపించడం లేదు. మేలురకం గ్రేడ్ బేళ్ల గరిష్ఠ ధర కిలో రూ.360 దాటకుండా వ్యాపారులు సీలింగ్ పెట్టి కొంటున్నారు. అలాగే గతంలో కిలో రూ.300కు అటుఇటుగా ఉన్న మీడియం గ్రేడ్ ధరలు ప్రస్తుతం రూ.260 నుంచి రూ.270లోపు ఉన్నాయి. ఇక అధికంగా పండిన లోగ్రేడ్‌లో నాణ్యమైనదిగా భావించే ఎఫ్5 రకం ధర కిలోకు రూ.50 మేర తగ్గింది. గతంలో ఈరకం ధర కిలో రూ.260పైనే ఉండగా ప్రస్తుతం రూ.205కు కొంటున్నారు. ఆ ధరకు కూడా కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోతుండటంతో నోబిడ్‌లు భారీగా పెరుగుతున్నాయి.

డోలాయమానంలో రైతులు

పొగాకు పెట్టుబడి వ్యయం కూడా ఇబ్బడిముబ్బడిగా అవుతోంది. నారు నుంచి ట్రాక్టర్ బాడుగలు, కూలి రేట్లు, పొలాల కౌళ్లు, బ్యారన్‌ల అద్దెలు భారీగా పెరిగాయి. మంచి ధరలు లభిస్తుండటంతో రైతులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుత సీజన్‌లో కూడా ఇటీవల వరకూ రికార్డు స్థాయి ధరలు లభించాయి. వాటిని చూసి వచ్చే సీజన్‌కు రైతులు ముందస్తుగాకు పొగాకు పొగాలు, బ్యారన్‌లు లీజుకు తీసుకన్నారు. ఎకరా పొలం కౌలు రూ.25వేల నుంచి రూ.35 వేల వరకూ చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. బ్యారన్‌లను కూడా రెండున్నర లక్షల రూపాయల వరకు లీజుకు ముందుగానే తీసుకున్నారు. ఈదశలో గడచిన నెలరోజులుగా పొగాకు ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు తీసుకున్న పొలాల విషయంలో డోలాయమానంలో పడ్డారు. కౌలుకు ఇచ్చిన రైతులు కూడా ధరలు తగ్గిస్తున్నట్లు సమాచారం.

ఎక్కువగా లోగ్రేడే వెనక్కి.

జిల్లాలో సోమవారం మార్కెట్‌ను పరిశీలిస్తే ఒంగోలు-1 కేంద్రానికి 1,540 బేళ్లు రాగా 1,229 కొనుగోలు చేశారు. అక్కడ 291 బేళ్లు నోబిడ్ అయ్యాయి. ఒంగోలు-2కు వెయ్యి బేళ్లు రాగా 170, టంగుటూరుకు 951 బేళ్లు రాగా 135, కొండపి కేంద్రానికి 1,085 బేళ్లు రాగా 206 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. పొదిలిలో హమాలీల కొరతతో 278 బేళ్లు మాత్రమే అనుమతించగా 32ను తిరస్కరించారు. తిరస్కరణలు జరుగుతున్న బేళ్లలో 95శాతం వరకు లోగ్రేడ్ ఉంటున్నాయి. ఇదిలా ఉండగా ధరలు తగ్గిన నేపథ్యంలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ ఈ సోమవారం కొండపి, టంగుటూరు వేలంకేంద్రాలను సందర్శించారు. అక్కడ కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా లోగ్రేడ్ ధరల తగ్గుదల విషయాన్ని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లి ధరలు నిలకడగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తం మీద వేలం ముగింపు దశ సమయంలో ధరలు పెరగాల్సింది పోయి తగ్గడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



వేలంలో పాల్గొన్న అధికారులు

సాగు తగ్గించాలనుకుంటున్నా..:

బొక్కిసం శేషయ్య, కట్టావారిపాలెం, కొండపి మండలం

నేను గత ఏడాది 18 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయి. కూలీల కొరత కూడా ఉంది. ఈ సంవత్సరం ఇప్పటికే పచ్చాకు ముఠాలకు రూ.5వేలు అడ్వాన్స్ కూడా చెల్లించా. అదేసమయంలో ప్రస్తుతం వేలం కేంద్రాల్లో ధరలు కూడా పడిపోయాయి. ఈ పరిణామాలతో వచ్చే సీజన్‌లో సాగు విస్తీర్ణం తగ్గించి బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పండించాలని నిర్ణయించుకున్నా.

పునరాలోచనలో పడ్డా

కొత్తపల్లి వెంకటేశ్వర్లు (గుణ), జమ్ములపాలెం

నేను గత ఏడాది 25 ఎకరాల్లో పొగాకు పండించా. అధికారిక పంట కొనుగోళ్ల సమయంలో మంచి ధరలు లభించాయి. దీంతో వచ్చే సీజన్‌లో సాగుకు ఇప్పటికే కొంత పొలాన్ని కౌలుకు తీసుకున్నా. అదనపు పంట కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత ధరలు పడిపోతున్నాయి. మరికొన్ని పరిణామాలు కూడా మున్ముందు మార్కెట్‌పై అనుమానాన్ని రేకెత్తిస్తున్నాయి. దీంతో వచ్చే సీజన్‌లో సాగుపై పునరాలోచనలో పడ్డా.

సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 27: సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలుపై సంబంధిత అధికారులతో జరిగిన కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పథకం ఉద్దేశాలు, లక్ష్యాలు, గృహాలు, కార్యాలయాలు, పరిశ్రమలలో సౌర విద్యుత్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. దాని ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలను, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెం, తాళ్లూరు మండలం తూర్పుగంగవరం, పామూరు మండలం కంబాలదిన్నె, మార్కాపురం మండలం వేములకోట, జరుగుమల్లి మండలం పాలేటిపాలెంలను ఈ పథకం కింద మోడల్ గ్రామాలుగా ఎంపికచేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రామాల్లో సత్వరమే సౌర విద్యుత్ వ్యవస్థను విస్తృతస్థాయిలో అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపైనా వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బులు కూడా త్వరగా జమచేసేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 15రోజులకు ఒకసారి ఈ పథకంపై సమీక్షిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎల్‌డీఎం డి.రమేష్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, జడ్పీ సీఈవో మాధురి పాల్గొన్నారు.

ఒంగోలులో సర్దుబాటు రీకౌన్సెలింగ్

36 స్థానాలు భర్తీ, 12 మంది మిగులు టీచర్లు

ఒంగోలు(విద్య), ఆగస్టు 27: ఒంగోలు మండలంలో టీచర్ల పని సర్దుబాటు కౌన్సెలింగ్ మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయ ఆదేశాల మేరకు మంగళవారం ఉపాధ్యాయులకు మళ్లీ రీకౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాటు చేశారు. మిగులు టీచర్ల సీనియార్టీ జాబితాలో ఒక టీచర్ సీనియార్టీ విషయంలో వచ్చిన వివాదం పెద్ద దుమారం రేగింది. దీంతో మిగులు టీచర్లకు మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించి ఖాళీస్థానాలను సర్దుబాటు చేశారు. ఒంగోలు మండలంలో 48 మంది ఉపాధ్యాయులు మిగులుగా తేలగా 37 స్థానాల్లో అవసరమని గుర్తించారు. మొదట జరిగిన కౌన్సెలింగ్‌లో 34 స్థానాలు భర్తీ కాగా 14 మంది మిగిలారు. అయితే సీనియార్టీ జాబితాలో తదితర 14 అంశాలపై టీచర్లు మళ్లీ గ్రీవెన్స్‌లో పెట్టారు. వాటిలో కేవలం మూడు మాత్రమే పరిష్కారం కాగా, మిగిలిన 11 అంశాలను తిరస్కరించారు. ఈ నేపథ్యంలో మొదట కౌన్సెలింగ్‌లో కోరుకున్న స్థానాలకు అందరూ అంగీకరించారు. అయితే గణితం అసిస్టెంట్ ఒకరు తనకు సీనియార్టీలో అన్యాయం జరిగిందని, తనకంటే జూనియర్‌ను జాబితాలో సీనియర్‌గా చూపించారని విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సీనియార్టీ తేడాపై డైరెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నోడల్ ఆఫీసర్, ఆర్‌జేడీలు కూడా రంగంలోకి వచ్చారు. ఒంగోలు ఎంఈఓ టి.కిషోర్‌బాబు సీనియార్టీ విషయంలో తన తప్పిదం లేదని, తాను పెట్టిన గ్రీవెన్స్ వాట్సాప్ మేసేజ్‌లు చూపించి ఉన్నతాధికారులను ఒప్పించారు. దీంతో ఫిర్యాదుచేసిన టీచర్‌కు న్యాయం చేసే విషయంలో మళ్లీ రీకౌన్సెలింగ్ నిర్వహించమని ఎంఈఓను ఆదేశించారు. దీంతో ఆయన కౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాటు చేశారు. తాజా సర్దుబాటులో 48 మంది మిగులు టీచర్లలో 36మంది స్థానాలు కోరుకోగా 12మంది మిగులుగా తేలారు. స్కూలు అసిస్టెంట్ హిందీ ఒక స్థానం భర్తీకాకుండా మిగిలిపోయిందని ఎంఈఓ కిషోర్‌బాబు తెలిపారు

ముగిసిన బదిలీల దరఖాస్తుల స్వీకరణ

ఏ గ్రేడ్ కార్యదర్శులను ఆ గ్రేడ్‌లోనే నియమించాలని అధికారులు ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 27 : జిల్లా పంచాయతీ కార్యాలయంలో బదిలీల దరఖాస్తుల గడువు స్వీకరణ మంగళవారంతో ముగిసింది. పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగులు, సిబ్బంది బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 31లోపు బదిలీల ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకనుగుణంగా పంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు జిల్లా పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. అయితే గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుత బదిలీల్లో ఏ గ్రేడ్ పంచాయతీ కార్యదర్శులను ఆ గ్రేడుల్లోనే నియమించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో సందిగ్ధం నెలకొంది. కొంతమంది కార్యదర్శులు తమకు అనుకూలమైన పంచాయతీల కోసం ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు చేయించుకోవడంతో ప్రతిష్టంభన నెలకొంది. జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు నాలుగు గ్రేడ్‌లుగా ఉన్నారు. మొదటి గ్రేడ్‌లో మేజర్ పంచాయతీలు ఉండగా మిగిలిన గ్రేడ్‌లు ఆయా పంచాయతీల స్థాయిని బట్టి ఉన్నాయి. అయితే ప్రస్తుతం కొంత మంది గత వైసీపీ ప్రభుత్వంలో గ్రేడ్-3 వారు కూడా గ్రేడ్-1 పంచాయతీల్లో కార్యదర్శులుగా కొనసాగుతున్నారు. అటువంటి చోట ప్రస్తుతం ఉన్నతాధికారులు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులను మాత్రమే నియమించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఇప్పుడు ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

రద్దు కానీ డిప్యుటేషన్లు

కాగా ప్రభుత్వం సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పంచాయతీరాజ్‌శాఖలో పనిచేసే ఉద్యోగుల డిప్యుటేషన్లను సంబంధిత అధికారులు రద్దు చేసి వారి పూర్వపు స్థానాలకు పంపాల్సి ఉంది. కానీ ఇంతవరకు ఆ డిప్యుటేషన్లను రద్దుచేసిన పరిస్థితి లేకుండాపోయింది. జిల్లా పంచాయతీ కార్యాలయంతో పాటు జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో సుమారు 60 మంది కార్యదర్శులు, సిబ్బంది డిప్యుటేషన్లపై కొనసాగుతున్నా వాటిని రద్దు చేయకపోవడంపై పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మొక్కులు తీర్చుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



దర్గా వద్ద నేతలు

తర్లుపాడు, ఆగస్టు 27: తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు దర్గాలో ప్రసిద్ధి గాంచిన కాశీంస్వామికి ఉమ్మడి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు తుమ్మలచెరువు దర్గాలో నాయకులు టీడీపీ అఖండ మెజార్టీ సాధించాలని మొక్కుకున్నారు. ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించడంతో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్యయాదవ్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, దామచర్ల సత్యలు కాశీంస్వామికి మొక్కులు తీర్చుకున్నారు

ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

అద్దంకి, ఆగస్టు 27 : ఫ్యాక్టరీలలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల అచ్యుతాపురంలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో మండలంలోని విప్పర్లవారిపాలెం వద్ద ఉన్న నీలి ఆక్వా, చినకొత్తపల్లి వద్ద ఉన్న వల్లభ ఫ్యాక్టరీలను మంగళవారం అధికారుల బృందం పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి అధికారులు ఫ్యాక్టరీలోని సిబ్బందికి సూచనలు చేశారు. అధికారులు రాఘవరెడ్డి, పరమేశ్వరరావు, మాధవనాయుడు, గీత, గాయత్రీదేవి, శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీచరణ్ ఉన్నారు.

అవార్డుకు ఎంపికైన చందలూరు ఉన్నత పాఠశాల

పంగులూరు, ఆగస్టు 27 : స్పోర్ట్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్‌కు చందలూరు ఉన్నత పాఠశాల ఎంపికైంది. రాష్ట్రంలో మూడు పాఠశాలలను క్రీడా ప్రతిభా అవార్డుకు, 130 పాఠశాలలను జిల్లా క్రీడా ప్రతిభ అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేసింది. జిల్లా ప్రతిభ అవార్డుకు బాపట్ల జిల్లా పరిధిలో ఎంపికైన 5 పాఠశాలల్లో చందలూరు ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు హెచ్ఎం గిరిజ తెలిపారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ పుట్టిన రోజు సందర్భంగా 29 నేషనల్ స్పోర్ట్స్ డేని పురస్కరించుకుని క్రీడా ప్రతిభా అవార్డులలో చందలూరు పాఠశాలకు స్థానం లభించిందన్నారు. ప్రతిభ అవార్డుకు కృషి చేసిన పీడీ ప్రతిమను హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న న్యాయవాది రఫీ

అద్దంకి, ఆగస్టు 27 : రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు, బాధ్యతల గురించి ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది షేక్ మహ్మద్ రఫీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత ప్రాథమిక నిర్బంధ విద్య పోక్సో యాక్ట్ తదితర చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రకాష్, హెచ్ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

చినగంజాం, ఆగస్టు 27 : భూ సమేత భావనారాయణ స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆమరా కుటుంబీకులు పూజలు చేశారు. ఆలయ అర్చకుడు మోహనలక్ష్మీనరసింహాచార్యులు శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహానికి విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్వామిని ఊరేగించారు. పాటలు, క్విజ్ పోటీలను నిర్వహించి బాలబాలికలకు బహుమతులు అందజేశారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం వేడుకను నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న గుంటుపల్లి మేజర్ కాలువ పనులు.. అభివృద్ధి అనంతరం అంబడిపూడి వద్ద కాలువ ఇలా

గుంటుపల్లి కాలువకు మహర్దశ

- మంత్రి గొట్టిపాటిని కలిసి సమస్యను వివరించిన నాలుగు గ్రామాల రైతులు
- తక్షణమే మేజర్ అభివృద్ధికి శ్రీకారం
- అన్నదాతల హర్షం

బల్లికురవ, ఆగస్టు 27 : ఎన్నో ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోని గుంటుపల్లి మేజర్ కాలువకు మహర్దశ పట్టింది. అద్దంకి బ్రాంచ్ కెనాల్ నుంచి చీలే గుంటుపల్లి మేజర్ కాలువ ద్వారా పెద అంబడిపూడి, చిన అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ గ్రామాలలోని మూడు వేల ఎకరాలకు పైబడి పంటలకు సాగు నీరు చేరాల్సి ఉంది. ప్రతి సారీ సాగు కోసం నీటిని విడదల చేసిన సమయంలో దిగువ ఉన్న భూములకు నీరు అందే పరిస్థితి లేదు. ఈ ఏడాది అన్ని డ్యాంలు నిండి వరి సాగుకు కూడా నీరు విడుదల జరుగుతుండడంతో రైతులు ఎంతో ఉత్సాహంతో పంటల సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ దశలో గుంటుపల్లి మేజర్ కాలువ దట్టమైన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు. దీంతో రైతులు పంటల సాగుకు నీరు వచ్చిన ఉపయోగం లేదని, తక్షణమే మేజర్ కాలువను అభివృద్ధి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. ఆయన స్పందించి ఎన్ఎస్పీ అధికారులతో మాట్లాడారు. వెంటనే గుంటుపల్లి మేజర్ కాలువను అభివృద్ధి చేయించాలని ఆదేశాలు ఇచ్చారు. గత రెండు రోజుల నుంచి అంబడిపూడికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు దద్దాల అంజయ్య పర్యవేక్షణలో మేజర్ కాలువ పరిధిలో ఉన్న ఏడు కిలోమీటర్లను పూర్తి స్థాయిలో రెండు ఎక్స్‌కవేటర్లతో అభివృద్ధి పనులను చేస్తున్నారు. అంబడిపూడి గ్రామం వద్ద కాలువలో పూడిక తీయడంతో కాలువలో నీటి ప్రవాహం చూసి రైతులు ఆనందపడుతున్నారు. మేజర్ కాలువలో ఉన్న పూడికతో పాటు తుమ్మ చెట్లను తొలగించి బయట పడవేయడంతో నీరు దిగువ భూములకు కూడా సకాలంలో చేరుతుందని రైతులు అంటున్నారు. ఏబీసీ కాలువ తూము నుంచి తక్కువ నీరు వచ్చిన వృథా కాకుండా పంటలకు చేరుతుందని రైతులు తెలిపారు. సకాలంలో మేజర్ కాలువ అభివృద్ధి పరచడం పట్ల నాలుగు గ్రామాలకు చెందిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మేజర్ కాలువ బాగు చేయడంతో రైతులు సొంతంగా చందాలు వేసుకొని మైనర్ కాలువలను అభివృద్ధి పరుస్తున్నారు. ఈ ఏడాది పంటలకు సాగు నీరు సకాలంలో అందేలా ముందస్తుగా మైనర్ కాలువలను బాగు చేసేందుకు రైతులు సన్నాహాలలో నిమగ్నమై ఉన్నారు.


వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

విజృంభిస్తున్న వైరల్ ఫీవర్‌లు

- బెంబేలెత్తుతున్న రోగులు
- ఏరియా హాస్పిటల్‌లో బారులు

చీరాలటౌన్, ఆగస్టు 27 : చీరాల మరియు చుట్టు ప్రక్కల వైరల్ ఫీవర్‌లు దడ పుట్టిస్తున్నాయి. మంగళవారం ఒక్కరోజే సుమారు 500 వరకు ఓపీలు చీరాల ఏరియా వైద్యశాలకు వస్తున్నాయి. సాధారణంగా జలుబు, జ్వరంతో ప్రారంభమై రోగం ముదిరి ప్రాణ సంకటంగా మారుతోంది. ఈక్రమంలో ఇప్పటికే చీరాల ఏరియా వైద్యశాలలో 112 మంది మంగళవారం వరకు ఇన్ పేషెంట్‌లుగా ఉన్నారు. అంతేకాకుండా గడిచిన రెండు రోజుల్లోనే ఏరియా వైద్యశాలలో నిర్వహించిన పరీక్షల్లో సుమారు 50 మంది డెంగ్యూ బారిన పడ్డారు. వీరిలో ప్రస్తుతం 7 మంది చిన్నారులు, 5 మంది పెద్దలు అడ్మిట్ అయి చికిత్స పొందుతున్నారు. రోగాన్ని ముందుగా గ్రహించలేని ప్రజలు రోగం ముదిరాక ప్రైవేట్ వైద్యశాలలకు పరుగులు పెడుతూ వేలల్లో ఖర్చులు చేస్తున్నారు. ఇదిలావుండగా రోగ నిర్ధారణలో డెంగ్యూతోపాటు లివర్ ఇన్ఫెక్షన్, కామెర్లు కూడా వస్తుండడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవగాహన లేమితో నాణ్యమైన వైద్యం అందకపోతే ప్లేట్‌లెట్స్ తగ్గి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ముందస్తుగా అప్రమత్తం అవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

ఏరియా వైద్యశాలలో నాణ్యమైన వైద్యం



ఏరియా వైద్యశాలలో బెడ్ల సంఖ్య పెంచాం. రోగం ప్రారంభ దశలోనే హాస్పిటల్‌కు చేరి వైద్య పరీక్షలు చేయించుకోవడం క్షేమకరం. ప్రజలకు అన్ని రకాల రక్త పరీక్షలకు ఏర్పాట్లు చేశాం. అలాగే వైరల్ ఫీవర్‌లను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ఒళ్లు నొప్పులు, జ్వరం, జలుబు, విరేచనాలు, దగ్గు, వాంతులు వంటివి ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డా.సుభాషిణి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్

ఏలూరి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

- నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారుతో మాట్లాడిన రెవెన్యూ అధికారులు
- ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేపడతామని రైతులకు భరోసా

పర్చూరు, ఆగస్టు 27 : వాడరేవు - పిడుగురాళ్ల రహదారి నిర్మాణంలో భాగంగా పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం సమీపంలోని లోవెల్ బ్రిడ్జి వద్ద తూములతో ఏర్పాటు చేస్తున్న కల్వర్టు నిర్మాణ పనులపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసారు. జాతీయ రహదారి నిర్మాణం నేపధ్యంలో లోవెల్ చప్టా ప్రాంగణంలో బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో కొద్దిపాటి వరదలు వచ్చిన సమీప గ్రామాల్లోని నీటితో పొలాలు ముంపునకు గురిఅవుతాయన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనులను నిలుపుదల చేసి చప్టాపై బ్రిడ్జిని ఏర్పాటు చేయాలనానరు. ఈసమస్యను రైతులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయారు. రైతుల సమస్యపై స్పందించిన ఏలూరి నేషనల్ హైవే అధికారులతో పాటు, తహసీల్దార్‌తో మాట్లాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.


హైవే అధికారులతో రైతుల సమక్షంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఏలూరి ఆదేశాలతో మంగళవారం నేషలన్ హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్ బ్రహ్మయ్య సిబ్బందితో వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించి రైతుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణంలో పంట పొలాలకు, గ్రామానికి ఎలాంటి వరద ముంపు లేకుండా చర్యలు చేపడతామని హైవే అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

చినగంజాం, ఆగస్టు 27 : మండలంలోని పెదగంజాం గ్రామంలోని ఇసుక క్వారీల నుంచి అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను మంగళవారం వేకువజామున పట్టుకున్నట్లు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. పెదగంజాం ప్రాంతంలోని ఇసుక క్వారీల నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను గ్రామానికి చెందిన ఆసోది వెంకటరమణారెడ్డితో పాటు పలువురు గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గ్రామస్థులు టిప్పర్లను ఆపి, పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సిబ్బందితో వెళ్లి టిప్పర్‌ను, ఇసుక లోడు చేసుకునేందుకు వచ్చిన రెండు టిప్పర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇసుక లోడు చేసుకున్న టిప్పర్‌ను సీజ్ చేసి, టిప్పర్ డ్రైవర్ నాగులుప్పలపాడు మండలం రాపర్ల గ్రామానికి చెందిన పెరికల ప్రవీణ్, టిప్పర్ యజమాని పి. కోటిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆర్డీవోకు ఆ రెండు టిప్పర్లను అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.


పోలీసులు సీజ్ చేసిన ఇసుక టిప్పర్

గ్రామానికి చెందిన మండల ప్రజాప్రతినిధి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవణా చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఆక్రమణలతో గ్రామస్థులకు అవస్థలు

మేదరమెట్ల, ఆగస్టు 27 : మేదరమెట్లలో ఆక్రమణదారులు మరలా రోడ్డెక్కరు. గత డిసెంబర్‌లో రహదారులు భవనాలశాఖ, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు కలిసి మేదరమెట్లలోని పాత జాతీయ రహదారిలో ఆక్రమణలు మొత్తం తొలగించారు. రెండో వాహనం కూడా దుకాణాలను సిమెంట్ రోడ్డు వరకు తెచ్చి పెట్టడంతో వాహనాలు రోడ్డుపై నిలిపి, దుకాణాలకు కొనుగోలు కోసం వచ్చే వాహనాలు నిలడపం వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు దుకాణదారులు రేకులతో సిమెంట్ రోడ్డు వరకు నిర్మాణాలు చేపట్టడంతో రాకపోకలకు సమస్యగా మారింది. దీనికితోడు షాపు యజమానులు షాపుల ముందు తోపుడు బండ్లకు అద్దెకు ఇవ్వడంతో వారు మరింత ముందుకు రావడం రెండో వాహనం నడపలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అధికారులు అప్పటిలో ఆక్రమణలు మొత్తం తొలగించారు. రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ కాలువ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు చేయించారు. ఈలోగా ప్రభుత్వం మారడంతో రోడ్డు నిర్మాణ పనులు మొదలు కాలేదు. అక్రమ నిర్మాణాలు తొలగించిన 8, 9 నెలలలోనే ఒకొక్కరుగా ముందుకు వచ్చి రేకుల నిర్మాణాలతో షాపులను ముందుకు జరపడంతో, తోపుడు బండ్లలను షాపులముందుకు తెచ్చి పెట్టడంతో సమస్య మొదటికి వచ్చింది. దీనికి తోడు షాపులముందు సిమెంట్ రోడ్డు కన్న ఎత్తుగా మెరకతోలడంతో వర్షపు నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. గతంలో ఆక్రమణలు తొలగించినప్పుడు రోడ్డు కంటే ఎత్తుగా ఉన్న మెరకను తొలగించడంతో వర్షపు నీరు సైడ్ డ్రైన్‌లోకి వెళ్లే మార్గం ఏర్పడింది. మరలా ఇప్పుడు మెరక తోలడం వలన వర్షపు నీరు రోడ్డుపై నిలిచి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఆర్ అండ్‌బీ, పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి మరల ఆక్రమణలు జరగకుండా చూడాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.


మేదరమెట్లలో మళ్లీ రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలు

వైభంగా మహాలక్ష్మమ్మ సంబరాలు

మార్టూరు, ఆగస్టు 27 : మార్టూరులోని నాగరాజుపల్లి సెంటరులో ఉన్న మహాలక్ష్మమ్మ తల్లి సంబరాలను మంగళవారం సంపత్‌నగర్ వాసులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏటా జరిగే ఆనవాయితీ లో భాగంగా సంపత్ నగర్ కు చెందిన మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో గంపలతో బంతిపూలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మ వారిని బంతిపూలతో అలంకరించారు. దాదాపుగా 30 క్వింటాళ్ల బంతిపూలతో అమ్మ వారికి అలంకరణ చేశారు. అమ్మవారి ప్రాంగణం అంతా విద్యుత్ దీపాలంకరణ చేశారు. తరువాత అమ్మ వారిని సంపత్‌నగర్‌లోని వీధులలో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట మహిళలు పెట్టిన పొంగళ్లను అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించారు. బాణసంచా కాలుస్తూ, కాలనీవాసులు అందరూ ఐక్యంగా అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అదేవిధంగా భక్తులు అమ్మ వారికి తమ మొక్కులను తీర్చుకున్నారు.


బంతిపూల అలంకరణలో మహాలక్ష్మమ్మ


గ్రంథాలయ సభ్యత్వ రశీదును అందజేస్తున్న ఆదిలక్ష్మి

గ్రంథాలయంలో తనిఖీ

మార్టూరు, ఆగస్టు 27 : జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి మంగళవారం మార్టూరు శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అక్కడున్న పుస్తకాలను, రికార్డులను పరిశీలించారు. అలాగే విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను వినియోగించుకోవాలని, పుస్తకాలతో జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. తరువాత విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య ఆర్థిక సహకారంతో 11 మంది బాలికలకు 550 రులు సభ్యత్వరుసుము చెల్లించి వారికి రశీదులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేశ్వరరావు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండల కేంద్రమైన సంతమాగులూరు గ్రంథాలయంలో మంగళవారం 2023-2024 సంవత్సరానికి సంబంధించిన వార్షిక తనిఖీల్లో భాగంగా ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఒంగోలుకు చెందిన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయంలో సభ్యత్వం కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో కోటేశ్వరరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సుబ్బారావు, గ్రంథ పాలకులు. బాదం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఎంవోయూ


ఎంవోయూని అందుకుంటున్న సెయింట్ ఆన్స్ ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 27 : తమ కళాశాలలో చదివే విద్యార్థులకు కోర్సు పూర్తయ్యే నాటికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని సెయింట్ ఆన్స్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వారు ఏపీఐఆర్2 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీవారితో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగంగా ఏపీఐఆర్ 2 కంపెనీ ప్రతినిధి గోపాలకృష్ణ (ఫౌండర్), సీఈవోతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, సెక్రటరీ, కరస్పాండెంట్‌లు ఎంఓయు పత్రాలను అందుకున్నారు. తద్వారా విద్యార్థులకు ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ అవగాహన ఒప్పందం 10 సంవత్సరాలపాటు కొనసాగుతుందని కళాశాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

45 మద్యం బాటిల్స్ స్వాధీనం

వేటపాలెం(చీరాల), ఆగస్టు 27 : రైల్వేస్టేషన్ సమీపంలోని బాలాజీ నగర్‌లో 45 మద్యం క్వార్టర్ బాటిల్స్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మహిళను వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి మంగళవారం ఉదయం పట్టుకున్నారు. కేసు నమోదు చేసి తగిన చర్యలు చేపట్టనున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.


మద్యం సీసాలను చూపుతున్న ఎస్ఐ

సభ్యత్వ నమోదులో కీలకపాత్ర పోషించాలి

చీరాల, ఆగస్టు 27 : బీజేపీ సభ్యత్వ నమోదులో పార్టీ శ్రేణులు కీలకపాత్ర పోషించాలని బాపట్ల పార్లమెంట్ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ తదితరులు పిలుపునిచ్చారు. రోటరీ కమ్యూనిటీహాలులో మంగళవారం బీజేపీ చీరాల అసెంబ్లీ కన్వీనర్ అరవపల్లి కుమార్ అధ్యక్షతన సాధారణ సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీపై ప్రజల్లో అపారమైన నమ్మకం ఉందన్నారు. ఆ క్రమంలో పార్టీ సభ్యత్వ నమోదులో అందరిని భాగస్వాములను చేయాలని చెప్పారు. చీరాల పట్టణ, మండల, వేటపాలెం మండల బాధ్యులకు కార్యాచరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మువ్వల వెంకటరమణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, వేముల వెంకటేష్, అవ్వా రు హనుప్రసాద్, శంకరశెట్టి నాగేశ్వరరావు, జయశంకర్, మనోహరరెడ్డి, శివాజీ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, భరజీరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హేమంత్

ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల, ఆగస్టు 27 : కొరిశపాడులో కట్టెల ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి చిలకలూరిపేట మండలం బొప్పూడి నుంచి ట్రాక్టర్ కట్టెల లోడుతో కొరిశపాడు వస్తుండగా మండల కార్యాలయం ఎదురుగా ఈ ప్రమాదం జరిగింది. చిలకలూరిపేట మండలం కొత్తరాజుపేటకు చెందిన కూలీ వల్లెపు నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా కట్టెల లోడు కింద చిక్కుకున్న వారిని స్థానికులు కాపాడారు. ఘటనా స్థలానికి కొరశపాడు పోలీసులు చేరుకొని గాయపడిన వారిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సాగు నీటి కోసం 2న ధర్నా

మార్టూరు, ఆగస్టు 27 : వారబందీ పద్ధతి ద్వారా కాకుండా మాగాణి పంటకు 2వ జోన్‌కు సాగర్ నీరు ఇవ్వాలని కోరుతూ మండల రైతు సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల2న మార్టూరులో ధర్నా కార్యక్రమం నిర్వహించడానికి తీర్మానం చేశారు. మంగళవారం మార్టూరులో రైతు సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. సాంబయ్య అధ్యక్షత వహించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రకాశం కలెక్టర్ ఇచ్చిన సమాచారం మేరకు 2వ జోన్‌కు ఆరుతడి పంటలు వేసుకోవడానికి మాత్రమే, అదికూడా వారబందీ విధానం ద్వారా సాగర్ నీరు విడుదల చేస్తారన్నారు. రెండేళ్ల నుంచి మాగాణి పంటలు లేక బియ్యం ధర విపరీతంగా పెరిగాయన్నారు. ఈ ఏడాది మాగాణికి నీరివ్వాలని కోరారు. సమావేశంలో రామకోటేశ్వరరావు, మోహనరావు, వీరవల్లి కృష్ణమూర్తి, హనుమంతరావు, నాగేశ్వరరావు, సూరిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

వంకాయలపాడులో వైద్య శిబిరం

స్పందించిన వైద్య సిబ్బంది

వంకాయలపాడు(ఇంకొల్లు), ఆగస్టు 27 : ఇంకొల్లు మండలం వంకాయలపాడులో విషజ్వరంతో బేతపూడి మరియమ్మ మృతి చెందగా మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 15 మంది సిబ్బంది 5 టీములుగా వైద్య సేవలందించారు. మరోపక్క పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు కాలవలను శుభ్రం చేయించి ఎబేటు చల్లి ఫాగింగ్ చేశారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి అంజలి, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది




రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి: కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం): పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ హాలు నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో మాట్లాడారు. రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యూటేషన్, లావాదేవీలపై తహసీల్దార్లు దృష్టి పెట్టాలని సూచించారు. ఎటువంటి కారణాలు లేకుండా దరఖాస్తులను తిరస్కరించవద్దని, అవసరమైతే అర్జీదారుతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాలల్లో మరమ్మతులకు ఆర్వో ప్లాంట్లను వెంటనే బాగు చేయాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని సెప్టెంబరు 1వ తేదీన 95శాతానికి పైబడి చేయాలని, ఉపాధి హామీ పనిదినాలను బాగా పెంచాలని ఆదేశించారు.

త్వరలో భూ బాంబ్!

- మార్కెట్ విలువల పెంపునకు కసరత్తు
- వివరాల సేకరించిన రిజిస్ట్రేషన్ శాఖ
- జేసీ ఆధ్వర్యంలో అధికారుల సమావేశం
- ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ప్రక్రియ





నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 27 : జిల్లాలో భూములు, స్థలాల మార్కెట్ విలువల పెంపునకు రంగం సిద్ధమైంది. ఆదాయం పెంపుపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం మార్కెట్ విలువలను పెంచేందుకు పూనుకొంటోంది. తద్వారా రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. వాస్తవంగా భూములు, స్థలాల విలువలు బహిరంగ మార్కెట్‌లో అధికంగా ఉండగా, రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువ మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. దీన్ని పరిగణలోకి తీసుకొని ఈసారి మార్కెట్ విలువలను 10 నుంచి 40 శాతం పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జిల్లా అధికారులకు మౌఖిక ఆదేశాలు అందటంతో భూములు, స్థలాల పెంపు ఏవిధంగా చేపట్టి, అమలు చేయాలనే అంశమై నివేదిక తయారు చేస్తున్నారు. ఆర్డీఓలు, నుడా అధికారులను సంప్రదించి విలువల పెంపునకు చర్యలు చేపట్టారు. మంగళవారం తన చాంబర్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధ్యక్షతన జరిగిన మార్కెట్ విలువల అమలు కమిటీ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు. మార్కెట్ విలువలు పెంపు వల్ల ప్రజల్లో వ్యతిరేకత రాకుండా చూడాలనే అంశంపై చర్చించినట్లు తెలుస్తోంది. మార్కెట్ విలువలు పెంచితే ప్రభుత్వానికి భూమి అవసరమైనప్పుడు ఎక్కువ మొత్తం రిజిస్ట్రేషన్ శాఖకు చెల్లించాల్సి వస్తుంది. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని నివేదిక తయారు చేస్తున్నారు.

● విలువైన భూములపై దృష్టి

జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. అంకణం విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేలు, లక్షల్లో ఉంది. ఎకరం రూ.కోట్లు దాటుతోంది. అయితే, రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువలు మాత్రం వేలు, లక్షలు దాటడం లేదు. దీంతో విలువైన భూముల మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలోని చాలా ప్రాంతాలలో వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మార్పు చెందాయి. కొత్త వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ భూములను, వ్యవసాయేతర భూములుగా మారుస్తూ భూమార్పిడి జరిగిన లేఅవుట్ల వివరాలను నుడా, ఆర్డీఓల నుంచి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సేకరించారు. మార్కెట్ విలువలకు సంబంధించిన అన్ని అంశాలపై నివేదికను పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్లు, జాయింట్ కలెక్టర్ ముందు ఉంచుతారు. ప్రభుత్వం నుంచి జీఓ విడుదల కాగానే మార్కెట్ విలువల పెంపు అమలులోకి రానుంది.

● 2019 నుంచి..

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు భూములు, స్థలా మార్కెట్ విలువలు పెరిగాయి. 2019లో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 10 నుంచి 30 శాతం పెంచారు. 2020లో ఎంపిక చేసిన పట్టణాల్లో 20 నుంచి 30 శాతం విలువలు పెరిగాయి. 2022లో జిల్లా కేంద్రాల్లో 20 శాతం పెరిగాయి. 2023లో జాతీయ రహదారులు, ఎంపిక చేసిన ప్రదేశాల్లో మార్కెట్ విలువలు 30 శాతం వరకు పెంచారు. పట్టణ ప్రాంతాల్లో ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాలలో రెండేళ్లకొకసారి రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతారు. ఈసారి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కూడా ఈ విలువలు పెరగనున్నట్లు సమాచారం.

నివేదిక తయారు చేస్తాం



జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో మంగళవారం మార్కెట్ విలువల పెంపుపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పెంపు అంశంతోపాటు పలు అంశాలు చర్చకు వచ్చాయి. ప్రాంతాల వారీగా పెంపునకు సంబంధించి నివేదిక తయారు చేస్తాం. ప్రభుత్వ ఆదేశాలు అందితే ఆ ప్రకారం మార్కెటు విలువల పెంపు అమలు ఉంటుంది. **- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్**



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

భూమార్పిడి డేటా వెబ్‌ల్యాండ్‌లో అప్లోడ్ చేయాలి!

● మార్కెట్ విలువల కమిటీలో జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 27 : భూముల మార్పిడి డేటాను వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో భూముల మార్కెట్ విలువల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మార్కెట్ విలువను నిర్ధారించడం ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయ, నష్టాన్ని అరికట్టాలన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల డేటా సంబంధిత రెవెన్యూ అధికారుల నుంచి పొందాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు. నీటి పారుదల సౌకర్యాల ఆధారంగా భూమి వర్గీకరణ స్వభావాన్ని మార్చాలన్నారు. కొత్తగా ఆమోదించబడిన లేఅవుట్లకు సర్వే నంబర్లు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, జడ్పీ సీఈఓ కన్నమ నాయుడు, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు భానుమతి, రాంబాబు, మిల్కిరోషన్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సమావేశం వాయిదా

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 27 : ఈనెల 29వ తేదీన కలెక్టరేట్‌లో జరగాల్సిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్లు కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హమ్మయ్య.. నిధులొచ్చాయి!

15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 34.68 కోట్లు విడుదల

నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమచేసిన కేంద్రం



నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 27 : నిధుల లేమితో కునారిల్లుతున్న పంచాయతీలకు కేంద్రం ప్రభుత్వం ఊరటనిచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి విడతగా జిల్లాలోని 722 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు 34,68,63,138 రూపాయలు విడుదలయ్యాయి. బేసిన్ గ్రాంట్స్ కింద రూ.13.87 కోట్లు, టైడ్ గ్రాంట్స్ కింద 20.81 కోట్ల రూపాయలు ఆయా పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో పంచాయతీల ఆర్థిక సమస్యలు చాలా వరకు గట్టెక్కనున్నాయి. సరిగ్గా ఏడాది క్రితం వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు అందాల్సిన ఆర్థిక సంఘం నిధులను రకరకాల పద్దులకు జమ చేయడంతో పంచాయతీలు ఆర్థికంగా కుంగిపోయిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితి గమనించిన కేంద్ర ప్రభుత్వం గత ఏడాది నుంచి నిధుల విడుదల పద్ధతి మార్చింది. కేంద్రం నుంచి నేరుగా పంచాయతీ ఖాతాలకే నిధులు జమ చేసే విధానం అమలులోకి తెచ్చింది. ఈ కొత్త పద్ధతి అమలులోకి వచ్చిన తరువాత మూడవ సారి 15 ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలకు జమ అయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను తొలి విడతగా విడుదలైన నిధుల వ్యయానికి సంబంధించిన ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. టైడ్ గ్రాంట్స్ కింద మంచినీరు, పారిశుధ్యం మెరుగు పనులకు వినియోగించాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ, స్కూళ్లకు మంచినీటి సరఫరా తదితరాలకు ఖర్చు చేయవచ్చు. బేసిక్ గ్రాంట్స్ నుంచి పంచాయతీ పరిధిలో కొత్త రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు, వీధి లైట్ల నిర్వహణ, స్మశానాల అభివృద్ధి తదితరాలకు ఖర్చు చేసుకోవచ్చు. మొత్తమ్మీద 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలతో పంచాయతీలు కొంతవరకు ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడ్డాయి.

మంచినీటి అవసరాలకే ప్రాధాన్యం



ప్రభుత్వం నుంచి నిధులు వస్తుంటే గ్రామంలో ప్రజల అవసరాలకు తగ్గట్టు పనులు చేయగలము. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. వీటితో తాగునీటి పర్యవేక్షణ మెరుగుపరుస్తాము. కొన్ని శాశ్వత పనులు చేయాల్సినవి కూడా ఉన్నాయి. కానీ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తాము. నిధులు జమ చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- కోసూరు సుభాషిణి, కాకుపల్లి సర్పంచి, నెల్లూరు రూరల్

అప్పులకు వడ్డీ కట్టలేకున్నాం!



గత మూడేళ్ల కాలంలో చెప్పాపెట్టకుండా విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుతో మా పంచాయతీలో రూ. 34 లక్షలు కట్ చేశారు. రూ.42లక్షలు అప్పు చేసి పంచాయతీలో పనులు చేశా. చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేసుకుంటుంటే మళ్లీ విద్యుత్ బిల్లుల బకాయిలు పెండింగ్ చూపించింది. వెంటనే మళ్లీ రూ. 2లక్షలు కట్టిన తర్వాత బిల్ అప్‌లోడ్ అయింది. ఇలా గత ప్రభుత్వంలో పంచాయతీ బిల్లుల రాక నానా ఇబ్బందులు పడ్డా. ఇప్పటికీ రూ.18లక్షలు అప్పులు తీరాల్సి ఉంది. తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టుకోలేక నిద్ర పట్టడంలేదు.

- కటకం నరసింహారావు, వైసీపీ సర్పంచి, చిన్నమాచునూరు, మర్రిపాడు మండలం

జడ్పీలో బదిలీల కోలాహలం

- ఐదేళ్లు పూర్తిచేసుకున్న వారికి తప్పనిసరి
- 217 మందితో జాబితా సిద్ధం



నెల్లూరు (జడ్పీ) : జిల్లా పరిషత్‌లో బదిలీల కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. ఈ నెల 31లోపు బదిలీల ప్రక్రియను ముగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఎంపీడీవోల నుంచి అటెండర్ల వరకు బదిలీలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విధివిధానాలను రూపొందించింది. ఒకేచోట ఐదేళ్లు పూర్తయిన వారి జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఇందులో ఆరుగురు ఎంపీడీవోలు, 10 మంది ఏవోలు, 27 మంది సీనియర్ అసిస్టెంట్లు, 70 మంది జూనియర్ అసిస్టెంట్లు, 20 మంది టైపిస్టులు, 11 రికార్డు అసిస్టెంట్లు, 73 మంది అటెండర్లు ఇలా మొత్తం 217 మందిని బదిలీ చేసేందుకు జాబితా సిద్ధం చేశారు.

● పైరవీల కోసం పాకులాట

ఐదేళ్లు పూర్తి చేసుకుని స్థానచలనం తప్పనిసరి అయిన వారంతా పైరవీల కోసం పాకులాడుతున్నారు. అనుకూల ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు ఎమ్మెల్యేల సిఫారసుల లేఖల కోసం ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల వద్దకు వెళ్లేందుకు అవకాశం లేనివారు తమను దూరప్రాంతాలకు బదిలీ చేస్తారన్న దిగులు వారిలో నెలకొంది.

ఫోర్జరీ కేసులో పోలీసుల దూకుడు

- కార్పొరేషన్, నుడా కార్యాలయాల్లో విచారణ
- పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్న డీఎస్పీ

నెల్లూరు (క్రైం), ఆగస్టు 27 : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఇప్పటికే ఈ కేసులో నగరపాలక సంస్థ టీపీవో దేవేంద్రను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇది జరిగి 24 గంటలు గడవక ముందే మంగళవారం నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డి కార్పొరేషన్ కార్యాలయంలోని ప్లానింగ్ విభాగం, నుడా కార్యాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. పలు ఫైళ్లను పరిశీలించడంతోపాటు ముఖ్యమైన ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసుల విచారణకు వచ్చిన ప్రతిసారి కార్పొరేషన్ కార్యాలయంలో ఇంకెదరు ఉద్యోగులు ఈ కేసులో ఇరుక్కుంటారన్న చర్చ నడుస్తోంది. మరోవైపు నుడా కార్యాలయంలో విచారణ చేయడం పెద్ద చర్చగా మారింది.

ప్రభుత్వ పాఠశాలలకు ఐదు క్రీడా ప్రతిభా అవార్డులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 27 : జిల్లాలో ఐదు ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు క్రీడా ప్రతిభా అవార్డులను ప్రకటించారు. గడిచిన ఏడాదిలో ఉత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించడంతోపాటు వివిధ క్రీడాంశాల్లో పతకాలు సాధించిన పాఠశాలలకు ర్యాంకులను కేటాయించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 29న నిర్వహించే జాతీయ క్రీడాదినోత్సవం రోజు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులను అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నెల్లూరులోని బీవీనగర్‌లో ఉన్న కేఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలకు ప్రథమ స్థానం, కోవూరు డివిజన్ పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ, నగరంలోని బీవీఎస్ నగరపాలక ఉన్నత పాఠశాల తృతీయ, కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల 4వ స్థానం, పొదలకూరు మండలం మహ్మదాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు 5వ స్థానం కేటాయించారు. జిల్లా విద్యాశాఖాధికారులు జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించి ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా అవార్డులు అందచేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు ఆదేశాలు జారీ చేశారు.

నేర నియంత్రణకు 'యాక్షన్'

- యాంటీ డ్రగ్ స్క్వాడ్ ఏర్పాటు
- మహిళల భద్రతకు పటిష్ట చర్యలు
- ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడి

నెల్లూరు(క్రైం),ఆగస్టు 27: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటూ నేర నియంత్రణే లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖలో జిల్లా వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ దాదాపుగా ముగిసిందన్నారు. ఈ క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. వాటి హాట్ స్పాట్లను మ్యాపింగ్ చేస్తున్నామని, ప్రత్యేకంగా యాంటీ డ్రగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తామని ఎస్పీ చెప్పారు. గ్రామాలలో విస్తృతంగా మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాత నేరస్థులు, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీసీ కెమెరాలు, మెరుగైన లైటింగ్, అలారం, హెచ్చరిక వ్యవస్థ, నైట్ పెట్రోలింగ్‌ను బలోపేతం చేస్తామన్నారు. సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. మహిళలు, పిల్లలపై నేరాలను సహించేది లేదని, ఎంతటివారైనా కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ హెచ్చరించారు. మహిళల భద్రత కోసం డయల్ 112 గురించి విస్తృత ప్రచారం చేయిస్తామన్నారు. అలాగే, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. రోడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌ను పెంచి ప్రజల సహకారంతో నేరాలు అరికడతామన్నారు. ప్రజలు నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలతో రూపొందించిన కరపత్రాన్ని ఎస్పీ ఆవిష్కరించారు.

జిల్లాలో ఎస్ఐల బదిలీలు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 27 : జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లకు ఎస్ఐలను బదిలీ చేయడంతోపాటు వీఆర్‌లో ఉన్న ఎస్ఐలకూ పోస్టింగ్‌లు కల్పిస్తూ మంగళవారం ఎస్పీ జి కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే తమకు కేటాయించిన ప్రాంతల్లో విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఎస్ఐ	ప్రస్తుతం	బదిలీ
ఎం.ఎస్ రాకేష్	వీఆర్	మనుబోలు
బి రమేష్‌బాబు	దర్గామిట	సంతపేట
జి బాలకృష్ణ	ఎస్ఈబీ	సంతపేట
బి వెంకటేశ్వర్లు	డిసిఆర్‌బి	నెల్లూరు రూరల్
బి లక్ష్మణ్‌రావు	గుడ్లూరు	నెల్లూరు రూరల్
షేక్ మహమ్మద్ సుభాని	బాలాజీనగర్	లింగసముద్రం
ఎం బాజీబాబు	లింగసముద్రం	వీఆర్
పి అనూష	సీతారామపురం	సోమశిల
వి సుబ్బారావు	సోమశిల	వీఆర్
కె శ్రీనివాసరావు	వీఈఆర్	మర్రిపాడు
ఎస్కే అబ్దుల్ రజాక్	వీఆర్	చిన్నబజారు
ఎం రఘునాథ్	వీఆర్	సీసీఎస్
కే.తిరుపతయ్య	వీఆర్	ఇందుకూరుపేట
శివశంకర్	నార్త్ ట్రాఫిక్	డక్కిలి

కలువాయి చెరువు నిర్వహణ గాలికి..

● మరమ్మతుల్లో తూములు
● పట్టించుకోని సోమశిల అధికారులు

కలువాయి, ఆగస్టు 27 : జిల్లాలోని పెద్ద చెరువుల్లో మూడోది కలువాయి చెరువు. అంతేకాక సోమశిల దక్షిణ కాలువ కింద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కూడా చేశారు. దక్షిణ కాలువ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలంటే ముందుగా సోమశిల నీటితో కలువాయి చెరువు నింపాలి. ఆ తరువాత ఇక్కడ నుంచి ఆయకట్టుకు విడుదల చేస్తుంటారు. దీంతో పాటు చెరువు కింద కలువాయి, నూకనపల్లి, తెలుగురాయపురం, బ్రాహ్మణపల్లి, బద్దెవోలు గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. ఇంతటి ప్రాధాన్యత కల్గిన చెరువు సోమశిల ప్రాజెక్టు అధికారుల కంట్రోల్‌లో ఉంటుంది. అయితే కొన్నేళ్లుగా ఆయకట్టుకు నీరు అందించే చెరువు తూములకు మరమ్మతులు లేవు. దీంతో ప్రస్తుతం ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందక కష్టాలు పడుతున్నారు. చెరువు కింద ప్రస్తుతం వరి సాగులో ఉంది. చెరువులో నీరు కూడా అడుగంటుతుంది. ఉన్న నీరు కూడా చెరువు తూములు సక్రమంగా లేక పోవడంతో పొలాలకు సక్రమంగా అందడం లేదు. దీంతో ఇటీవల బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ సొంత ఖర్చులతో తూముకు మరమ్మతులు చేసుకున్నారు. సోమశిల దక్షిణ కాలువకు నీరు విడుదల చేసే గేటు ఇటీవల కొట్టుకుపోయింది. దీనికి తాత్కాలిక మరమ్మతులు చేసి కాలువకు అవసరమైనప్పుడు నీరు విడదల చేస్తున్నారు. ప్రస్తుతం చెరువులో నీరు అడుగంటి పోతుండటంతో తూములు, దక్షిణ కాలువ రెగ్యులేటర్ గేటుకు శాశ్వత మరమ్మతులు చేసుకునేందుకు వీలు ఉంటుంది. కాబట్టి సోమశిల ప్రాజెక్టు అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.


తూముకు మరమ్మతు చేస్తున్న బ్రాహ్మణపల్లి రైతులు

ఘనంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 27: స్థానిక దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేపట్టారు. అనంతరం భగవద్గీత పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఉదయగిరి : స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సంగం : అభయాంజనేయుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

● ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు

సీతారామపురం : స్థానిక కురవవీధిలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను శ్రీకృష్ణయాదవ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు,గ్రామ సర్పంచి భాగ్యకుమారి హాజరై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాలలు వేసి, ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం కమిటీ నిర్వాహకులు ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బండి రవి, బండి మధు, ఆరేళ్ల దస్తగిరి, ఆరేళ్ల కాశి తదితరులు పాల్గొన్నారు.

● వైభవంగా అభయాంజనేయుడి విగ్రహం ఊరేగింపు

సంగం : మండలంలోని దువ్వూరులో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం స్వామివారి గ్రామంలో విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనకు విద్యార్థులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 27: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో రెండవ సెమిస్టర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ కేఎస్ఆర్ పాల్ మాట్లాడుతూ 80 మంది విద్యార్థులతోపాటు అధ్యాపకులు, సిబ్బంది మూడు రోజులపాటు పర్యటనకు వెళ్లనున్నారన్నారు. ఈ పర్యటనతో విద్యార్థులకు అవగాహన, అనుభవం కలుగుతాయన్నారు. అనంతరం జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు నారాయణస్వామి, కిషన్‌తేజ, అశోక్, క్రాంతి బోధన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోండి

కలువాయి, ఆగస్టు 27: మండలంలోని కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితశాస్త్రం బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ గణతంలో 50శాతం మార్కులు ఉన్న వారు అర్హులని తెలిపారు. వీరికి నెలకు రూ. 10వేలు గౌరవవేతనం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆత్మకూరు, ఆగస్టు 27 : మండలంలోని రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రత్యేక దృష్టి సారించామని తహసీల్దార్ వీ సుధీర్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పలువురు టీడీపీ నేతలు సమస్యలను ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. అర్హులకు కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు.

సోమశిలలో 32.866 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 27: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 13,763 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 32.866 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 2000, డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

వింజమూరు, ఆగస్టు 27: కావలి నుంచి రాత్రి 9గంటలకు వింజమూరు మీదుగా ఆత్మకూరు వెళ్లేందుకు బస్సు ఏర్పాటు చేయాలని ఇన్నోవేటివ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ స్టేట్ ఈసీ మెంబర్ లెక్కమనేని రాజేష్‌నాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే రాత్రి 10గంటలకు కావలి నుంచి వింజమూరు మీదుగా ఉదయగిరికి వెళ్లేందుకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.కావలి డివిజన్‌లోనే పెద్దదైన వింజమూరుకు రవాణా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

'మరుగుదొడ్ల బాధ్యత మాకొద్దు'

సీతారామపురం,ఆగస్టు 27: పాఠశాలల్లో మరుగుదొడ్లను ఫొటోలు తీసే బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వం సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు అప్పగిస్తూ జీవో జారీ చేయడం బాధాకరమని, ఆ పనిని తమకు అప్పగించడం తగదని మండలంలోని సచివాయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు ఎంఈవో మస్తాన్‌వలికి వినతిపత్రం అందచేశారు. ఉపాధ్యాయులే అవమానంగా భావించిన పనని తమకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు.ప్రతి సచివాలయం పరిధిలో నాలుగు నుంచి ఆరు పాఠశాలలు ఉన్నాయని, ఈ పని తమకు భారం అవుతుందని వారు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ నేత్రదానాన్ని ప్రోత్సహించాలి

ఆత్మకూరు, ఆగస్టు 27: నేత్రదానాన్ని ప్రోత్సహించడంలో ప్రతి ఒక్కరూ తోడ్పడాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎం. శర్వాణి పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్యశాలలో మంగళవారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. దేశంలో 50 లక్షల మంది కార్నియా అంధత్వంతో బాధపడుతున్నారని తెలిపారు. కావున ప్రజలందరూ నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్ఎంవో డాక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శర్వాణి

● విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ఉదయగిరి రూరల్ : మండలంలోని బిజ్జంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అప్తాలమిక్ అసిస్టెంట్ బీ సాహితి విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. నాయబ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన టీడీపీ నేతలు


ఎస్ఐ షేక్ జిలానీని సన్మానించిన టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఆగస్టు 27 : ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన షేక్ జిలానీని మంగళవారం పలువురు టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పులిమి శైలజారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, జీ వేణు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

సంగం, ఆగస్టు 27: మండలంలోని దువ్వూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాకారులు నాటికల రూపంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల వ్యాపించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్యపై ఒక్కరోజు శిక్షణ

సీతారామపురం, ఆగస్టు 27 : స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో మస్తాన్‌వలి ఆధ్వర్యంలో మంగళవారం దూరవిద్యపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్‌లో న్యూ అడ్మిషన్ కోసం మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో అవగాహన కల్పించి, వయోజనులను గుర్తించి దూర విద్యలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ సూపర్‌వైజర్, సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి

తహసీల్దార్‌కు సన్మానం

అనంతసాగరం, ఆగస్టు 27: తహసీల్దార్ వీర వసంతరావును మంగళవారం మండల జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ప్రభుత్వ కార్యాలయాల్లో జరిపేలా ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భరత్, ఉదయగిరి రవి, ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై నిరసన ర్యాలీ

వింజమూరు, ఆగస్టు 27 : కోల్‌కతాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను ఖండిస్తూ మంగళవారం పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శివాలయం నుంచి బంగ్లా సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఘటన జరిగి ఇన్ని రోజులు అవుతున్నా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పొన్నూరు ప్రకాశం, పానుగంటి రమేష్, టీవీ సురేష్, దేగా మధుయాదవ్, బిందు, చేబ్రోలు వసంతరావు, కొండా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి సీఐకి సత్కారం

వింజమూరు : కలిగిరి సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటనారాయణను టీడీపీ నేతలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలాగా శాంతి భద్రతల పరిరక్షణ చేపట్టాలని కోరారు కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, గూడా నరసారెడ్డి,మంచాల శ్రీనివాసులునాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లునాయుడు, వెంకటరెడ్డి, ఏగినేని శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.


సీఐని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

రైల్వే కార్మికుల హర్షం

బిట్రగుంట: కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ ప్రకటించడంపై మంగళవారం రైల్వే కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. స్థాని పీడబ్ల్యూఐ కార్యాయం వద్ద ఎస్ఆర్ఎంయూ బ్రాంచ్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక పీడబ్ల్యూఐ ఏకే కృష్ణన్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

కావలిరూరల్, ఆగస్టు 27: నేను కూడా రైతు బిడ్డనే.. రైతుల కష్టాలు తనకు తెలుసు.. కావలి కాలువ ఆయకట్టు కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్పీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులో భాగంగా రాజకీయ అవకాశాలు కల్పిస్తే వారు ఇంట్లో కూర్చుని సమావేశాలకు వారి భర్తలను, పిల్లలను పంపటం సరికాదని ఇలాంటి ఆచారానికి స్వస్తి పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీడీవో శ్రీధర్‌బాబు, డీఎల్‌పీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏపీవో కాంతారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ క్రిష్ణచైతన్య, జడ్పీటీసీ జంపాని రాఘవులు, వైస్ ఎంపీపీ అరగల కవిత, తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ

● తుమ్మలపెంట రోడ్డు నిర్మాణానికి 1న శంకుస్థాపన

కావలి : ఐదేళ్ల వైసీపీ పాలనలో కావలి-తుమ్మలపెంట రోడ్డులో రాకపోకలకు ప్రజలు పడిన నరకానికి విముక్తి కలిగిస్తూ సెప్టెంబరు 1న రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ రోడ్డుపై 9 కి.మీ పాదయాత్ర చేపట్టి తుమ్మలపెంట కూడలిలో మహిళలచే శంకుస్థాపన పైలాన్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన రోజే రోడ్డు పనులు ప్రారంభించి డిసెంబరు 31 నాటికి పూర్తి చేసి జనవరి 1న ఈ రోడ్డుపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, గుత్తికొండ క్రిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, మొగిలి కల్లయ్య, పోతుగంటి అలేఖ్య, నాయుడు రాంప్రసాద్, బొట్లగుంట శ్రీహరినాయుడు, తిరువీధి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రోడ్డులో ఆక్రమణల తొలగింపు

కావలి, ఆగస్టు 27: పట్టణంలోని రైల్వే రోడ్డులో వైసీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ కేవీ నారాయణ రోడ్డు స్థలం ఆక్రమించి నిర్మించిన రెండు దుకాణాలను మంగళవారం ఉదయం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ ఆక్రమణలను గతంలోనే గుర్తించిన అధికారులు తొలగించేందుకు ఎక్స్‌కవేటర్‌తో వెళ్లగా అప్పట్లో వైసీపీ నేతలు అడ్డుకున్నారు. మరుసటి రోజు తొలగింపునకు వెళ్లగా అప్పటికే స్టే తెచ్చినట్లు చూపించడంతో దానిని వదిలి వేశారు. ఆ తర్వాత ఆ రెండు చిన్న దుకాణాలకు ఇచ్చిన డీకేటీ పట్టా నకిలీ అని తహసీల్దారు ఇచ్చిన ధ్రువీకరణపత్రం, అవి రోడ్డు ఆక్రమణలో ఉన్నాయని సర్వేయర్ సర్వే రిపోర్టు ఇవ్వడంతో వాటి ఆధారంగా కోర్టులో ఉన్న స్టేను తొలగింపచేశారు. దీంతో అధికారులు ఆ దుకాణంలో ఉన్న సామాన్లు తీయించి పోలీసుల సహకారంతో కూల్చివేశారు.


ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ఆక్రమణలు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

అల్లూరు, ఆగస్టు 27 : మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాతావరణంలో చోటు చేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని మానవాళికి ప్రమాదం లేకుండా చేసే విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సాధారణ వ్యవసాయానికి ప్రకృతి వ్యవసాయానికి ఉన్న వ్యత్యాసాన్ని, దిగుబడుల శాతాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నెల్లూరు వ్యవసాయాధికారి శైలజ కుమారి, మధురిమ, అల్లూరు వ్యవసాయాధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థినులకు అభినందనలు

లింగసముద్రం, ఆగస్టు 27 : విజయవాడలోని చెన్నుపాటి కోటయ్య ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీలలో, తిరుపతి జిల్లా రేణిగుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగిన రెజ్లింగ్ పోటీలలో మండలంలోని పెదపవనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థినులు ఏ మౌనిక, డి.సమీరా, ఎం మేఘన, పి అనుదీవెన, డి.క్రాంతి, కె.లక్ష్మీప్రసన్న, జె.అలేఖ్య, జె.అక్షయ, బి.మహాలక్ష్మిలను ప్రిన్సిపాల్ కె స్నేహలత, ఉపాధ్యాయని పి.మాధవి, పీఈటీ పీ జ్యోతిర్మయిలు మంగళవారం అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

కావలి టౌన్, ఆగస్టు 27: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శ్రేణులు విజయవంతం చెయ్యాలని ఆ పార్టీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేతుల మీదుగా సెప్టెంబరు 1వ తేదీన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. బూత్ స్థాయిలో 200 సభ్యత్వాలు చేయించాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, రంగారెడ్డి, కమల, పరుశు వెంకటేశ్వర్లు, మాధవి, సీవీసీ సత్యం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ విద్యార్థులు ప్రతిభ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు, ఆగస్టు 27: ఉమ్మడి ప్రకాశం జిల్లా నాయీ బ్రాహ్మణ పేద విద్యార్థులు ప్రతిభ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి కరేటి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నాయీబ్రాహ్మణ విద్యార్థులు చదువులో మెరుగ్గా రాణిస్తున్న వారందరికీ ఉపకార వేతనాలు అందిస్తామని, ఆసక్తి కలిగిన వారు ఒంగోలు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రాఘవ బుక్‌డిపోలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

కావలి ల్యాండ్ మార్క్‌గా జాతీయ జెండా : సీపీఐ

కావలి, ఆగస్టు 27: పెద్దపెద్ద నగరాలు, పట్టణాలకు ల్యాండ్ మార్క్ ఉన్నట్లుగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఏర్పాటు చేసిన జాతీయజెండా ఐకానిక్ కావలికి ఒక ల్యాండ్ మార్క్‌గా గుర్తింపు తెచ్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. మంగళవారం సీపీఐ నేతలతో కలిసి ఆయన ఐకానిక్‌ను సందర్శించారు. 100 అడుగుల జాతీయ జెండా, అక్కడ ఏర్పాటు చేసిన దేశ ప్రముఖులు, కావలి శాసనసభ్యులుగా పనిచేసిన వారి చిత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబు, సీపీఐ కావలి నియోజకవర్గ సహాయకార్యదర్శి పీ.బోస్, కే.నరసింహారావు, చేవూరు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు

బిట్రగుంట, ఆగస్టు 27 : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో వెలసి ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలు మూడు రోజుల పాటు జరుగుతాయని, శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పాటు జ్ఞానప్రసూనాంబ, కుమారస్వామి, నవగ్రహాలు, జంటనాగుల విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణం, అన్నసంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

వైభవంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

బిట్రగుంట, ఆగస్టు 27: బోగోలు మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మంగళవారం కూడా ప్రత్యేక పూజలు, ఉత్సవ కార్యక్రమాలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంప్రదాయం ప్రకారం రోహిణి నక్షత్రాన కొండబిట్రగుంట ప్రసన్న వేంకటే శ్వరస్వామి దేవస్థానం వైష్ణవ శ్రీకృష్ణ జయింతి వేడుకలు ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని సంతాన గోపాల కృష్ణుడు ఊరేగింపుగా ఆలయ తూర్పు ఈశ్యాన్య మూలమండపానికి చేరుకున్నాడు. అనంతరం ఉట్టి కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. బోగోలు యాదవపాలెంలోని వేణుగో పాలస్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున వేణుగోపాలుడి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.


గ్రామోత్సవంలో వేణుగోపాలుడు

సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన

బిట్రగుంట, ఆగస్టు 27: పంట పొలాల్లో భూసారాన్ని పెంచుకునేందుకు పశువులు, పచ్చిరొట్ట ఎరువులు వాడాలని వ్యవసాయ అధికారులు శైలజాకుమారి, మధురిమ అన్నారు. బోగోలు మండలం తాళ్లూరు, బిట్రగుంట గ్రామ పంచాయతీలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కలిగిరి, ఆగస్టు 27: ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులతోపాటు ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఉమాశంకర్ పేర్కొన్నారు. స్థానిక కలిగిరమ్మ కూడలిలో మంగళవారం రాత్రి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. అక్కడ సిబ్బందిని నియమించి రోడ్డుపై అడ్డదిడ్డంగా ఉన్న వాహన యజమానులకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. కూరగాయలు, నిత్యావసరాల దుకాణాల యజమానులకు రహదారిపై రాకుండా హెచ్చరికలు జారీ చేశారు. పట్టణంలో ప్రధాన సమస్యగా ఉన్న ట్రాఫిక్‌పై ఎస్ఐ దృష్టి సారించడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నేతలకు అభినందనలు

కావలి, ఆగస్టు 27: టీడీపీ యాప్‌ను అత్యధికంగా వినియోగించి సామాజిక మాధ్యమాల్లో టీడీపీకి విశేష ప్రచారం కల్పించిన వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకాలతో ప్రశంసాపత్రాలు పంపి ప్రశంసించారు. వీటిని పొందిన అంబటి కిషోర్‌చౌదరి, ప్రళయకావేరి సాయిశివరాం, దేవరపాటి నాగేశ్వరరావు, కావలి జగన్‌మోహన్‌రావు, తటవర్తి సాయిచరణ్, పట్నం బాలక్రిష్ణ, నక్కల రవి, కంచర్ల సీతారామయ్యలకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి అభినందించారు.

అంగన్‌వాడీల్లో సూపర్‌వైజర్ విచారణ

వలేటివారిపాలెం, ఆగస్టు 27 : మండలంలోని చుండి అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత మంగళవారం విచారణ చేపట్టారు. చుండి బస్టాండు సెంటరులోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు కోడిగుడ్లు ఇవ్వడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తున్నారని ఈ నెల 23న జరిగిన మండల సమావేశంలో చుండి సర్పంచు ఇరపని సతీష్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని ఎంపీపీ మౌనిక, ఎంపీడీవో శేషుబాబు ఆదేశించారు. ఈ మేరకు సూపర్‌వైజర్ చుండిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలను, గర్భిణులు, పిల్లల తల్లిదండ్రులను విచారించగా వారంతా తమకు సకాలంలో పౌష్టికాహారం అందుతున్నట్లు తెలియజేశారు.

నేడు ఎమ్మెల్యే ఇంటూరి పర్యటన

వలేటివారిపాలెం, ఆగస్టు 27 : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం మండలంలో పర్యటించనున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న ల్యాబ్, కంప్యూటర్ గదికి ఆయన శంకుస్థాపన చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, సొసైటీ మాజీ అధ్యక్షుడు వలేటి నరసింహం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెంకు చెందిన పొగాకు బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు పాల్గొంటారని, మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని కార్యక్రమాని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.